

ఆంధ్రప్రదేశ్
జూన్ 1969



ఆంధ్రప్రదేశ్

సంపుటి: 13]

జూన్ 1969

జ్యేష్ఠ-ఆషాఢ. 1891 శా.శ

[సంచిక 8

ప్రధాన సంపాదకులు

వి. వామనరావు

సంపాదకులు

ఎన్. వి. గోపాలశాస్త్రి

మొదటి అట్ట: "నా జన్మలో చూడలేదు బాబూ"

రెండో అట్ట: సురక్షిత ప్రాంతాలకు ప్రయాణం

మూడో అట్ట: తుఫానుకు కూలిపోయినవి చెట్లా, జీవితాలా?

నాలుగో అట్ట: రైలు వంతెనకు మరమ్మతులు

50 పైసలు


Regd. No. H. 133.

రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు ప్రతి సందర్భంలోనూ ప్రభుత్వ అభిప్రాయాలు కావు.

ఈ సంచికలో....

పేజీ







గడ్డు రోజులు

కృష్ణా, గోదావరి వంటి జీవనదులకూ, అపార ప్రకృతిసంపదకూ నిలయమైన ఆంధ్రప్రదేశ్‌ అప్పుడప్పుడు ఒక వంక వరదలకూ మరొక వంక అనావృష్టికీ గురి అవుతూ విశేషనష్టం జరుగుతూ వుండడం దురదృష్టకరం. రాయలసీమ ప్రాంతంలో ఏటేటా కరువు తాండవిస్తుంటుంది. డెల్టా ప్రాంతాల్లో పచ్చని పంటభూములు వరదల పాలవుతుంటాయి. ఈ మామూలు పరిస్థితులకు తోడు యీ యేడు తెలంగాణా ప్రాంతంలో మరొక గడ్డు పరిస్థితి ఏర్పడింది. ఈ ఆపదల మేఘాలు త్వరలోనే విచ్చిపోగలవనీ, శాంతి సుస్థిరతలతో మన రాష్ట్రం మళ్లీ ప్రగతి కృషిలో పురోగమించగలదనీ ఆశిద్దాం.

డెల్టా జిల్లాలలో తుఫాను వల్లా, భారీ వర్షాలు, వరదల వల్లా జరిగిన నష్టం యిటీవలి చరిత్రలో ఎన్నడూ కనీ వినీ ఎరుగనట్టిది. మే నెల మధ్యలోవచ్చిన యీ ఆపదవల్ల పంటలకూ, పశువులకూ అపారనష్టం సంభవించింది. ఎంతో మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఇంత భారీఎత్తున జరిగిననష్టం వివిధ ప్రాంతాల ప్రజల, ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించింది ఇతర దేశాల వారుకూడా చలించారు. ఇటీవల కొద్దికాలం క్రితమే హైదరాబాదు సందర్శించిన ఇరాను రాజు సానుభూతి సందేశం పంపారు. వరదబాధితులకు "ప్రగాఢ సానుభూతి" తెలుపుతూ ఐక్యరాజ్యసమితి కార్యదర్శి యూథాంట్ కూడా సందేశం పంపారు. ఈ గడ్డుపరిస్థితిలో ఐక్యరాజ్య సమితి ఏ విధంగా ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోగలదో పరిశీలించి నివేదిక సమర్పించ వలసిందని కూడా ఆయన ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమాల స్థానిక ప్రతినిధిని కోరారు. పశ్చిమ జర్మనీ ప్రభుత్వం వరద బాధితులకు రూ. 28,500లు విరాళం పంపింది.

తుఫాను, వరదల వల్ల వేయిమంది మరణించారు. సుమారు 100కోట్ల రూపాయలకుమించిననష్టం సంభవించింది. అందువల్లనే తుఫాను వరదబాధితులకు సత్వరసహాయం అందచేయడానికై లభ్యమైన వనరులన్నిటినీ ఉపయోగించుకోవలసిన అవసరం, దానికి తగు యంత్రాంగాన్ని రూపొందించుకోవలసిన అవసరంఏర్పడినవి. రాష్ట్రప్రభుత్వం తుఫానుబాధితులకుసహాయంగా రూ.6కోట్లు మంజూరు చేసింది. కేంద్రప్రభుత్వం మొదట్లో ఒక కోటి రూపాయలు విడుదలచేసింది. తర్వాత మళ్లీ 3 కోట్ల రూపాయలు ఋణంగా మంజూరుచేసింది. ఈ ఋణం డెల్టాజిల్లాలలో వరదనిరోధక కార్యక్రమాలు, మురుగుపారుదల పథకాలకోసం ఉద్దేశించబడింది. వరదలు సంభవించిన సమయంలో విజయవాడలో వున్న డిప్యూటీ ప్రధాన మంత్రి శ్రీ మొరార్జీదేశాయి యీఅపారనష్టాన్ని కండ్లారా చూశారు. జిల్లా అధికారులు, కొన్ని స్వచ్ఛందసంస్థలూ సకాలంలో పనిచేసి ప్రజలను ఆదుకున్నారు. వరద నివారణ నిధికి రావలసినంత పెద్దఎత్తున ఉదారంగా విరాళాలు రాలేదనేది నిర్వివాదం. మానవులకు ఎక్కడ ఆపద జరిగినా తోటి మానవులహృదయాలు చలించడం సహజం. అందులోనూ సమీపవాసులైన ప్రజలకు కలిగిన ఆపద నిజంగా మనకు కలిగినట్లుగానే భావిస్తాం. వరదబాధితులకు ఉదారంగా సహాయం అందించి వారికి తగిన పునరావాస సౌకర్యాలు కల్పించడంలో మన రాష్ట్ర ప్రజలుగానీ యితర ప్రాంతాల, దేశాల ప్రజలుగానీ ఎంతో ఆదుర్దా కనపరుస్తున్నారు.

*   *   *   *   *


మే 3 వ తేదీన ప్రసిద్ధ విద్యావేత్త, పండితుడు, రాజనీతిజ్ఞుడు, రాష్ట్రపతి జాకిర్ హుసేన్ పరమపదించారు. ఆయన మన దేశంలోని మతాతీత రాజ్యాంగ వ్యవస్థకు నిజమైన ప్రతినిధి: అతి నిరాడంబరుడు. మంచికీ మర్యాదకూ ఆయన ప్రతీక. హైదరాబాదులో పుట్టి పెరిగిన కారణంగా హైదరాబాద్ నగరం ఆయనకు ప్రీతిపాత్రం. హైదరాబాదులోని ఆయన జన్మగృహాన్ని సేకరించి దాన్ని జాతీయ చిహ్నంగా రూపొందించాలనే ప్రతిపాదన ఒకటి వున్నది. ఆయన వినయసముద్రుడు కమక ఆ సూచనకు అంగీకరించలేదు. కాని ఆయన అనంతరం యీ ప్రతిపాదనను పునరుద్ధరించి ఆయనను గౌరవించడం మన కర్తవ్యం. ఆ విధంగా ఆయన ఆశించిన మతాతీత సాంఘిక వ్యవస్థకూ, ఆయన వినయ వినమ్రతలకూ, ఆయన స్థితప్రజ్ఞతకూ ఒక జాతీయ చిహ్నం హైదరాబాదులోవుండే అవకాశం ఏర్పడడం మనందరికీ సంతోషదాయకం.


—పి. వి. ఆర్.

ఆంధ్ర ప్రదేశ్‌లో తుఫాను బీభత్సం

ముఖ్య మంత్రి రేడియో ప్రసంగం

"నేడు రాష్ట్రం ఒక వంక ప్రకృతి సంక్షోభాన్ని మరొక వంక మానవకల్పిత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఈ తరుణంలో మనమంతా కలిసి కట్టుగా చేయవలసిన కృషి ఎంతయినా వుంది. అవాంతరంగా వచ్చిన ప్రకృతి సంక్షోభాన్ని కాని తదితర సమస్యలను కాని మనం సమైక్యతతో సంఘీభావంతో ఎదుర్కొని భవిష్యత్తును బాగుచేసుకోవాలి. ఇదే రాష్ట్ర ప్రజలకు నాహృదయపూర్వక విజ్ఞప్తి."





కోస్తా జిల్లాలలో జరిగిన తుఫాను భీభత్స దృశ్యాలను విమానంలో నుండి పర్యవేక్షించి వచ్చిన తర్వాత, ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంనుండి మే 22 న ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డి వరదబాధితుల సహాయార్థం ప్రభుత్వం తీసుకొనవలసిన చర్యలన్నీ సత్వరంగా అమలు జరుగుతాయని హామీ ఇచ్చారు. ఉదారంగా సహాయం అందజేయమని కలెక్టర్లకు ఆదేశాలు జారీచేయబడినవని ముఖ్యమంత్రి తెలియజేశారు. ప్రధానమంత్రి, ఉపప్రధానమంత్రి రాష్ట్రానికి సహాయం అందచేస్తామని తెలియచేశారని ముఖ్యమంత్రి అన్నారు.

ముఖ్యమంత్రి ప్రసంగంలోని భాగాలు

మన రాష్ట్రంలోని కోస్తాజిల్లాలలో మే 16 వ తారీకునుండి ఊహించనంతగా కుంభవృష్టిగా వర్షాలు పడడంవల్ల, తీవ్రతుఫాను


వల్ల కలిగిన అపారమైన నష్టంగురించి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇదివరకే కొంత తెలుసును. ఇటువంటి వర్షాలు గత నాలుగయిదు దశాబ్దాల్లో ఎప్పుడూ రాలేదని స్థానికులు చెప్తున్నారు. ముఖ్యంగా గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలు తీవ్రనష్టానికి గురయినవి. పంటలు బాగా దెబ్బతిన్నవి. రవాణా సౌకర్యాలకు తీవ్రమైన అంతరాయం కలిగింది. అనేక మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు.

ఈ అతివృష్టివల్ల మరణించినవారి కుటుంబాలకూ, పంటలూ ఆస్తులూ, పోగొట్టుకున్నవారికీ నా హృదయపూర్వక సానుభూతిని అందజేస్తున్నాను.


జలమయమైన ప్రాంతాలన్నింటినీ విమానంనుండి నేను చూశాను. నేను చూసిన దృశ్యాలు నాహృదయాన్ని తీవ్రంగా కదిలించివేశాయి. ఇంతటి అసాధారణమైన జలప్రళయాన్ని నా అరవై ఏళ్ల జీవితంలో నేను ఎప్పుడూ చూడలేదు.

అతివృష్టికి గురయిన ప్రాంతాలకు సత్వర సహాయం అందజేయడానికి ప్రభుత్వయంత్రాంగం ఏమాత్రం జాప్యంలేకుండా కార్యరంగంలో ప్రవేశించింది. ప్రధానమంత్రి, ఉప ప్రధానమంత్రి రాష్ట్రానికి సహాయం అందజేస్తామని తెలియజేశారు.

అనేకమంది ప్రయాణీకులతోవున్న సర్కారు ఎక్స్‌ప్రెస్సు ఉప్పు గుండూరువద్ద, విజయవాడ ప్యాసింజరు అమ్మనబ్రోలువద్ద



ఆగిపోవాల్సి వచ్చింది. నిలిచిపోయిన ప్రయాణీకులకోసం తిండి పొట్లాలు విమానాల్లోంచి క్రిందికి వేయబడినవి. ఈ రైళ్లలో వున్న ప్రయాణీకులు ఒంగోలు చేర్చబడ్డారు. అక్కడ వారికి తగిన సౌకర్యాలను స్థా. క రెవిన్యూ సిబ్బంది ఏర్పాటు చేసారు. అలాగే ఖమ్మం జిల్లాలో తొండలగోపవరంవద్ద ఎనమిదివందల మంది ప్రయాణీకులతో నిలిచిపోయిన రైలు ప్రయాణీకులకు కూడా భోజనం పొట్లాలు అందజేయబడినవి. సత్వర సహాయక చర్యలు తీసుకోటానికి రైల్వేసిబ్బందితో ఖమ్మంజిల్లా కలెక్టరు కృషి సల్పారు. తొండలగోపవరంవద్ద నిలిచిపోయిన ప్రయాణీకులను మధిర తీసుకురావడానికి వాహన సౌకర్యాలుఏర్పాటు చేయబడినవి.




దెబ్బతిన్న నీటి వనరులు

గుంటూరు జిల్లాలో నూటికి పైగా పెద్దనీటివనరులూ, చిన్న నీటివనరులూ దెబ్బతిన్నవి. గుంటూరు కాలువకు అనేకచోట్ల గండ్లు పడినవి. పెనుమాకవద్ద పెద్దకూరపాడు, సత్తెనపల్లి మధ్యగా గండ్లు పడ్డాయి. గుంటూరు, మాచర్ల విభాగంలో రెడ్డిగూడెం వద్ద రైల్వేబ్రిడ్జి బాగా దెబ్బతిన్నది. రైల్వే, టెలిఫోను సౌకర్యాలు పూర్తిగా దెబ్బతిన్నవి.

కృష్ణా జిలాలో బందరు కాలువలో అరవయిఎనిమిది గజాల వరకు గండ్లు పడినవి. కలిదిండి ప్రాంతంలో బంటుమల్లి కాలువకు కూడా గండ్లు పడ్డాయి. అలాగే ఏలూరు కాలువకూ, కృష్ణాజిలాలో

పెద చెరువయిన బ్రహ్మయ్యలింగం చెరువుకూ, నందిగామ, జగ్గయ్యపేట, నూజివీడు తాలుకాలలోని అనేక చెరువులకూ గండ్లు పడినవి.



ఖమ్మం జిల్లాలో తొండలగోప వరం, ఎర్రుపాలెం మధ్య రైల్వే లైన్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. వైరాలో ఒక వంతెనపూర్తిగా కూలి పోయింది.

గుంటూరు పట్టణంలో పల్లపు ప్రాంతాలలోవున్న వేయికుటుంబాలు సమీపంలోవున్న సురక్షిత ప్రాంతాలకు తరలించ బడినవి. వారికి భోజన తదితర సదుపాయాలు ఏర్పాటుచేయడం జరిగింది. బాపట్ల, ఒంగోలు, రేపల్లె, తెనాలి, నర్సరావుపేటతాలూకాలలో అనేకగ్రామాలకు బయట ప్రపంచంతో పూర్తిగా సంబంధం తెగిపోయింది. విజయవాడలో పల్లపుప్రాంతాలన్నీ పూర్తిగా జలమయమై పోయాయి. ఇరవైవేల మంది ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించబడ్డారు. వారికోసం సహాయక చర్యలు గైకొనబడినవి.

పంటల నష్టం

గుంటూరుజిల్లాలో రెండవపంట దెబ్బతిన్నది. పశ్చిమగోదావరిజిల్లాలోని కొల్లేరు ప్రాంతంలోని దాళ్వాపంటకు తాడేపల్లి గూడెం, ఏలూరు తాలుకాల్లోని దాళ్వా పంటకు దెబ్బ తగిలింది.




జన నష్టం

పెద్దగంజాం శివారు నిలాయపాలెంలో 185 మంది ఏనాది వారు మరణించారు. హృదయ విదారకమైన విషయమిది. బయట ప్రపంచంతో సంబంధంలేకుండా విజయవాడ పట్టణం నాలుగయిదు రోజులు ఒక ద్వీపంలా వుండిపోయింది మే 18వ తారీకురాత్రి విజయవాడ బస్తీలో ఒక ఇల్లు కూలిపోయి 11 మందిమరణించారు.

పశునష్టం కూడా విపరీతంగా సంభవించింది. నీళ్ళలో తేలుతూ అనేక జంతువుల కళేబరాలు కన్పించాయి.

కలెక్టర్లు వరదబాధిత ప్రాంతాల్లో సత్వరచర్యలు తీసుకోవడానికి తమ అధికారులనూ సిబ్బందినీ వెంటనే పంపించారు. కృష్ణాజిల్లాలోపల్లపు ప్రాంతాలలో జలమయ ప్రాంతాలలోవున్న ఇరవైవేలమంది జనం, ముప్పయి సహాయక కేంద్రాలకు తరలించబడ్డారు. వారికి భోజనం అందజేయబడింది పారిశుద్ధ్యం, వైద్య సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. నల్గొండ, ఖమ్మంజిల్లాల నుండి హెల్తు ఇనస్పెక్టర్లను, హెల్తు అసిస్టెంట్లను విజయవాడకు పంపించడానికి ఏర్పాట్లుచేశారు. కలరా మొదలైన అంటువ్యాధులు సోకకుండా సత్వరచర్యలు తీసుకోవడానికి హైదరాబాదు, తిరుపతి



నుండి వైద్య బృందాలు కూడా వెళ్ళాయి. గుంటూరుజిల్లాలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయబడుతున్నవి. గుంటూరు వైద్య కళాశాలలోని, ఆస్పత్రులలోని వైద్యుల వైద్యసహాయం అందజేస్తారు.

సహాయక కమిటీ

కృష్ణాజిల్లా కలెక్టరు ఒక సహాయక కమిటీని వెంటనే ఏర్పరిచారు. జిల్లాపరిషత్తు అధ్యక్షులూ, స్థానికంగావున్న శాసనసభ్యులు శాసనమండలి సభ్యులూ ఈ కమిటీలో వున్నారు. స్థానిక రైసు మిల్లర్ల సంఘం, రైసు డీలర్ల సంఘం నూటఏభై బస్తాలబియ్యాన్ని వరదబాధితులకు అందజేస్తామనిహామీ ఇచ్చారు. బుడమేరులో వరదలు రావడంవల్ల రాయనపాడు, గూడవల్లి, కలిదిండి మొదలైన గ్రామాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించబడ్డారు. వారికి సత్వర సహాయం అందజేయడం కూడా జరిగింది.

జరిగిన నష్టం గురించి ఇది రేఖామాత్రంగా ఇస్తున్న వివరణ ఇంకా పూర్తి నివేదికలు అందితేకాని మొత్తం నష్టంగురించి ఇప్పుడు చెప్పడం కష్టం. జరిగిన నష్టం చూస్తేనేకాని దాని తీవ్రత మనకు చప్పున అర్థం కాదు. గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలకు కనీవినీ ఎరుగని తుఫానువల్ల అపారమైననష్టం వాటిల్లింది. ఖమ్మం జిల్లాకు కూడ కొంతవరకు తుఫాను తాకిడి తగిలింది.

ఉదారసహాయం

ప్రభుత్వం తీసికోవలసిన సహాయక చర్యలన్నీ సత్వరం తీసుకోబడుతవి. ఉదారంగా సహాయం అందచేయమని కలెక్టర్లకు ఆదేశాలు జారీచేయబడినవి. అయితే ఈసమయంలో కేవలం ప్రభుత్వం తీసుకున్న చర్యలతో అంతాకాదు. లయన్సుక్లబ్బు, రెడ్‌క్రాసువంటి సంస్థలు ఇప్పటికే కొంత సహాయం అందచేసినవి. తదితర స్థానిక స్వచ్ఛంద సేవా సంఘాలు కూడా ముందుకు వచ్చి తమ సహాయాన్ని అందచేయాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. రాష్ట్రంలో తుఫానువల్లజరిగిన నష్టానికి తాత్కాలిక రాష్ట్రపతి తమ గాఢవిచారాన్ని వ్యక్తపరిచారు. తుఫానుబాధితులకు తమ సానుభూతిని అందచేయమని వారుకోరారు.

మంత్రుల పర్యటన

రాష్ట్రప్రభుత్వ సిబ్బందికి తోడ్పడటానికి ఒక సైనిక పటాలం అప్పుడే గన్నవరం చేరుకున్నది. డిప్యూటి రక్షణ మంత్రి శ్రీ ఎం. ఆర్. కృష్ణా గారి సహాయంతో మిలటరీపడవలు రేపు ఉదయానికి గుంటూరు వెళ్తున్నాయి. మరికొన్ని పూనానుండి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటాయి. ఈసంవత్సరం నారుమళ్ళ వగైరా సకాలంలోవేసు కోవటానికి జూన్ 1 వ తారీఖున నీళ్ళ వదలమని వుత్తర్వులు జారీ చేయబడినవి. దెబ్బ తిన్న ధాన్యం ఉప్పుడు బియ్యంగా మార్చే విషయం, ఫుడ్ కార్పొరేషన్ వల్ల కొనుగోలు ప్రయత్నం 3, 4 రోజులలో ఏర్పాట్లుచేయటం జరుగుతుంది.

వరదబాధిత ప్రాంతాలను చూడటానికి రెవెన్యూ మంత్రి శ్రీ వి.బి. రాజు గారు, మద్యనిషేధ మంత్రి శ్రీ వెనిగళ్ల సత్యనారాయణ గారు, రాష్ట్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కాకాని వెంకటరత్నం గారు, దేవాదాయ మంత్రి శ్రీ రుద్ర రాజు రామలింగ రాజుగారు అప్పుడే బయల్దేరి వెళ్లారు. కలెక్టర్ల నుండి పూర్తి నివేదికలు అందగానే ఇతోధికంగా సహాయక చర్యలు తీసుకోబడుతవి

ఇలాంటి సమయంలో నైనా,మనం అందరం ఐకమత్యంతో కలసి, అందరి మంచికోసం పాటు పడాలని మీ అందరినీ కోరుతున్నాను.

❀

సానుభూతి సందేశాలు

యుథాంట్

"ఆంధ్రప్రదేశ్‌లో యిటీవల సంభవించిన వరదలకు గురి అయిన వారికి తమ గాఢసంతాపాన్ని తెల్పుతూ, యీ అత్యవసర పరిస్థితిని యెదుర్కొనేందుకు ఐక్యరాజ్యసమితి తమ సహాయాన్ని అందజేస్తుంది." అని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి శ్రీ యు థాంటు, ప్రధానమంత్రికి కేబుల్‌ద్వారా సందేశం పంపారు.

ఆ సందేశంలో యింకా యిలా ఉంది. "ఇటీవల విపత్కర పరిస్థితులకు గురియైన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు, భారత ప్రభుత్వానికి ఐక్యరాజ్య సమితితరపున నా ప్రగాఢ సానుభూతిని తెల్పుతున్నాను. పరిస్థితుల వివరాలను తెల్పుతూ, యీ విపత్కర పరిస్థితులలో ఐక్యరాజ్యసమితి సకాలంలో యే విధంగా తోడ్పడగలుగుతుందో వివరిస్తూ నివేదిక అందజేయాల్సిందిగా ఐక్యరాజ్యసమితి అభివృద్ధికార్యక్రమాల స్థానికప్రతినిధిని నేనుకోరినాను." అనిఆయన అన్నారు.


ఇరాన్ చక్రవర్తి

ఇరాన్ చక్రవర్తి ఆంధ్రప్రదేశ్‌లో తుఫాన్ ఫలితంగా సంభవించిన ఆస్తి జన నష్టాలకు తమ విచారాన్ని వ్యక్తంచేశారు. హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేశారు.

తాత్కాలిక రాష్ట్రపతి శ్రీ వి.వి.గిరికి పంపిన తమ సందేశంలో ఆయన యిలా అన్నారు, "దక్షిణభారత దేశంలో తుఫాన సంభవించిన ఫలితంగా అపారమైన ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగినదనే వార్తలు నాకు చాలా విచారాన్ని కలుగజేశాయి. ఈ సందర్భంలో మీకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ మృత్యువాతబడిన వారి సంబంధీకులకు నా సానుభూతి తెల్పుతున్నాను."

పశ్చిమజర్మనీ అధ్యక్షుడు

పశ్చిమజర్మనీ ప్రెసిడెంటు డా. హెన్రిచ్ ల్యూబ్కె, తాత్కాలిక రాష్ట్రపతి, శ్రీ వి వి. గిరికి సానుభూతి సందేశం పంపుతూ తుఫానువల్ల విపత్కర పరిస్థితికి గురిఅయిన వారికి తమ గాఢసంతాపం వెలిబుచ్చారు



ః రద బాధితులకు ఆహార ధానా లు అందజేయుచున్న దృశ్యం

పాకిస్తాన్ అధ్యక్షులు కూడా తుఫాను బాధితులకు సానుభూతి సందేశం పం ా రు.

తుఫాను బాధితులకు సహాయక కార్యక్రమాలు

రాష్ట్రంలోని కోస్తాజిల్లాలోనూ ఖమ్మంలోనూ తుఫానుకు గురిఅయిన ప్రాంతాలలో సహాయక కార్యక్రమాలను తక్షణంఅమలు జరపడానికి వీలుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ 5 కోట్లుమంజూరు చేసింది. భారతప్రభుత్వ ఆర్థికశాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఒక కోటి రూపాయలు విడుదల చేసింది.

తుఫాను బాధితుల సహాయార్థం రాష్ట్రప్రభుత్వానికి ప్రధాన మంత్రి సహాయక నిధినుండి ఒక లక్షరూపాయలు పంపారు.

భారత కేథలిక్ సంస్థ, రూ. 15000 లు యిచ్చింది.

నిజామాబాద్ జిల్లా బోధన్ తాలూకా ఏటొండ గ్రామస్థులు రూ. 1116 లు యిచ్చారు.

తమిళ సినిమానటుడు శివాజీగణేశన్ రూ. 10,000 లు.

నిజామ్ ధర్మనిధి సంస్థ : రూ. 10,000 లు

రామదాసు మోటారు సంస్థ, కాకినాడ. రూ.10,000 లు

ఆంధ్రప్రభ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ యాజమాన్య సంస్థ రు. 20,000 లు విరాళంగా యిచ్చింది.

నాగార్జున సాగర్ మహిళా క్లబ్ రు 500 లు విరాళంగా సేకరించింది.

నాగార్జునసాగర్ సహకార కేంద్రస్టోర్స్ నూతనభవనం సంఘమిత్ర ప్రారంభోత్సవం సందర్భంగా సంఘం సభ్యులు, సిబ్బందీ రు. 3000 లు విరాళంగా యిచ్చారు.

రాజమండ్రికి చెందిన 9 మంది స్త్రీలతో సహా ఔత్సాహిక రంగస్థల నటులు, పట్టణమంతా పర్యటించి వరదబాధితుల సహాయకనిధికి విరివిగా విరాళాలు అందజేయాలని ప్రజలను ప్రబోధించారు.


వారు రు 1590-44 లు, 160 కిలోల బియ్యం, వస్త్రాలు సేకరించారు.

ఆంధ్రప్రదేశ్ మెడికల్ రిప్రెజెంటేటివ్‌ల సంఘం, గుంటూరు యూనిటువారు అనేక రకాల ఔషధాలను విరాళంగా యిచ్చారు.

తిరుమల తిరుపతి దేవస్థానం : లక్ష రూపాయల విలువైన వస్త్రాలను విరాళంగా యిచ్చారు.

వైజాగ్ లయన్స్ క్లబ్ : రు. 5,500 లు విరాళంగా యిచ్చారు.

తుఫాను వరదబాధితుల సహాయార్థం, మే 30 వ తేదీన విజయవాడలో తెలుగు చలనచిత్ర వారోత్సవానికి సినిమానటుడు అక్కినేని నాగేశ్వరరావు ప్రారంభోత్సవం చేశారు.



వరద బాధితులకు విమానాల నుండి ఆహారం సరఫరా

కొన్ని విరాళాలు

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల వరదలకు గురిఅయిన వారి సహాయార్థం పశ్చిమజర్మనీ రూ.28,000 ఇచ్చింది.

అక్కినేని నాగేశ్వరరావు చలనచిత్ర రజతోత్సవ సన్మాహక సంఘం రూ. 50,500 లు విరాళంగా యిచ్చింది.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి నిధివారు రూ. 1,11,111 లను విరాళంగా యిచ్చారు.



ఆహార సరఫరాలో సైనికుల సహాయం

వరదబాధిత ప్రాంతాలలో పార్లమెంటు సభ్యుల పర్యటన

శ్రీయుతులు కె. రఘురామయ్య, ఎం. తిరుమలరావు, శ్రీ కె. నారాయణరావులతో కూడిన పార్లమెంటు సభ్యుల బృందం వరదలకు గురిఅయిన ప్రాంతాలలో విస్తృత పర్యటన కార్యక్రమాన్ని చేపట్టే నిమిత్తం జూన్ 1 వ తేదీన గుంటూరు వెళ్ళారు. ఉత్తర భారతదేశంలోని వార్తా పత్రికల తరఫున 9 మంది సభ్యులుగల జర్నలిస్టుల బృందం గుంటూరు; కృష్ణాజిల్లాలలో వరదలకు గురిఅయిన ప్రాంతాలలో పర్యటించారు.

సమైక్యతా సాధనగా భాష

— సి. వి. హెచ్. రావు

దేశపు విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, దీర్ఘకాలం పాటు శ్రద్ధగా ఆలోచించిన మీదట జరిగిన రాష్ట్రాల పునర్నిర్మాణ పథకం ఒకప్రాంత ప్రజలలోవి ఒక వర్గం వారిచే సవాలుచేయ బడడం ఇటీవల తెలంగాణాప్రాంతంలో ఏర్పడిన పరిణామాలవల్ల ప్రస్ఫుటమైన ప్రధాన అంశం. ఒకప్పుడు ఉన్నతమైనవిగానూ, సహేతుకమైనవిగానూ పరిగణించబడిన విలువలను, నిశ్చయాలను సైతం ఒక ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు, ప్రదేశాల విలీనీకరణకు ప్రాతిపదికలైన ఏర్పాట్లను అసంపూర్తిగా అమలు పరచడంవల్ల, సవాలుచేయడం జరుగవచ్చుననే అంశాన్నికూడా ఈ పరిణామాలు వెల్లడిస్తున్నాయి. ఈనాడు మనం తెలంగాణాలో చూస్తున్న ఆవేశపూరితమైన ఆందోళనకు మరోకారణం కనిపించదు. 1956వ సంవత్సరంలో రాష్ట్రాల పునర్నిర్మాణ సంఘం నివేదిక తరువాత–భారతదేశంలోని రాష్ట్రాలు ఏ ఆశయాలతో, ఏ సిద్ధాంతాలతో నైతే పునర్నిర్మించబడినవో వాటికి ఈ ఉద్యమం భంగం కలిగిస్తున్నది.

రాష్ట్రాల పునర్నిర్మాణసంఘం అధ్యక్షుడైన సర్ సయ్యద్ ఫజల్ అలీతోనూ. సభ్యుడు శ్రీ కె.ఎం. పణిక్కర్‌తోనూ కొత్త ఢిల్లీలో నేను 1954. 1955 వ సంవత్సరాలలో జరిపిన సంభాషణలను గురించి ఈ సందర్భంలో ప్రస్తావిస్తాను. సర్ ఫజల్ అలీ పాట్నా హైకోర్టు న్యాయమూర్తిగానూ, ప్రధానన్యాయమూర్తిగానూ పనిచేస్తూ పాట్నాలో వున్నప్పుడే నాకు ఆయన తెలుసు. ఒకేభాష మాట్లాడే ప్రజలను సన్నిహితులను చేసే సూత్రబంధపు న్యాయబద్ధతనూ శక్తినీ గురించి ఆయన తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలోని రాష్ట్రాలను భాషా ప్రాతిపదికపై పునర్నిర్మించడంవల్ల చేకూరగల ప్రయోజనాలను గురించికూడా ఆయన పేర్కొన్నారు. సర్ ఫజల్ అలీ భాషా ప్రాతిపదికపై ఏర్పడిన రాష్ట్రానికి చెందినవారు. తెలుగు భాష మాట్లాడే యావన్మంది ప్రజలతో విశాలాంధ్ర రాష్ట్ర నిర్మాణం జరగాలని కొన్ని సంవత్సరాలుగా ఆందోళన జరుగుతున్న ప్రాంతంనుండి నేను వచ్చాననే సంగతి ఆయనకు తెలుసు. విశాలాంధ్రరాష్ట్ర నిర్మాణానికి సంబంధించి అప్పుడు పరిశీలనలోవున్న ప్రతిపాదనను గురించి ఆయన నన్ను అడిగారు. హైదరాబాదు రాష్ట్ర విభజన ఆంధ్ర తెలంగాణా నాయకులు అనేకమంది తమ ప్రాంతాల విలీనీకరణకై చేసిన ప్రతిపాదనలుకూడా పరిశీలనలో వున్నాయి. కేరళ ప్రాంతీయుడైన శ్రీ పణిక్కర్‌కూడా, భాషా ప్రాతిపదికపై రాష్ట్రాలను పునర్నిర్మించడాన్ని సమర్థించారు. ఆయన అభిప్రాయానుసారమే ప్రత్యేక కేరళరాష్ట్ర నిర్మాణం కొరకు రాష్ట్రాల పునర్నిర్మాణ సంఘం సిఫార్సు చేసింది. భాషా ప్రయుక్తరాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వాన్ని బలహీనపరిచేవిగాకాక జాతీయ ప్రయోజనం దృష్ట్యా కేంద్రాన్ని పటిష్టం చేసేవిగా వుండాలన్నది వీరుభయుల అభిప్రాయం.

ప్రజలను సమైక్యంచేసే శక్తి భాషకు వుంటుందన్న వాదాన్ని వ్యతిరేకించని వారు చాలామంది వున్నారు. అయితే ఈ ప్రాతిపదికపై పరిపాలనా ప్రాంతాలను వ్యవస్థీకరించడంలో ఆర్థిక స్వయంపోషకత్వం మొదలైన వివిధ విషయాలను కూడా పరిగణలోనికి తీసుకోవాలని వీరి అభిప్రాయం. రాష్ట్ర నిర్మాణానికి భాష మూల సూత్రంగా వున్నప్పటికి కూడా ఈ అంశాలు ఉపేక్షించ వలసినవికావు.

ఒకభాషమాట్లాడే ప్రజలు చాలా అధికసంఖ్యలో వున్నట్లయితే ఆ భాషా ప్రజలకు ఒకటికంటే ఎక్కువ రాష్ట్రాలు వుండవచ్చు. అయితే వారు ఏక స్వభావం కలిగిన ప్రాదేశిక యూనిట్లలో యిమడగలిగిన వారై వుండాలి. అయితే ఫెడరల్ వ్యవస్థలోవివిధ రాష్ట్రాలు–భాషా ప్రాతిపదికపై ఏర్పడినవైనప్పటికీ–పరిమాణం, విస్తీర్ణం, జనాభా, ప్రకృతి వనరులు, మొదలైన విషయాలలో పెద్ద వ్యత్యాసం కలిగివుండకూడదు. ఈ విధమైన తారతమ్యాలు వున్న పక్షంలో వాటిమధ్య రాజకీయ, ఆర్థిక రంగాలలో అవాంఛనీయమైన పరిణామాలు ఏర్పడుతాయి.

స్వతంత్ర ప్రతిపత్తికలిగిన లేక కొంతవరకు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన అనేక ప్రాంతాలను ఒకేకేంద్ర అధికారం క్రిందికి తెచ్చిన భారతావని వంటి ఫెడరల్ దేశంలో, ఇట్టికేంద్రాధికారం క్రింద వీటి ఏకీకరణ జాతి సమైక్యతకు దోహదం చేయగలదనీ, కేంద్రం తన బాధ్యతలను నిర్వర్తించడానికి వీలుగా ఈ ఏకీకరణ కేంద్రం అధికారాన్ని బాగా పటిష్టం చేయగలదనే హామీ వుండడం అవసరం. రాష్ట్రాలు ఉమ్మడి సొమ్ములోనుంచి తమకు చెందవలసిన దానిని కోరవచ్చు. సాంఘికమైన, ఆర్థికమైన వెనుకబడిన తనం వంటికారణాలవల్ల ఎక్కువ వాటానుకూడా కోరవచ్చు కాని అవి దేశానికి ఈ విషయంలో బెడదగా తయారుకాకూడదు. కేంద్రాన్ని బలహీన పరిచే విధంగా అవి కోర్కెలు కోరుతూవుండకూడదు.

భాషాప్రయుక్త రాష్ట్రాల నిర్మాణాన్ని గురించి పరిశీలించడం కొరకు వివిధ సమయాలలో నియమించబడిన ధార్ కమీషను జె.వి.పి. కమిటీ, రాష్ట్రాల పునర్నిర్మాణ సంఘంవంటి అనేక

కమిషన్లు, కమిటీలు పై అంశాలను ప్రధానంగా దృష్టిలో పెట్టు కున్నాయి. అయితే ఈ సంఘాలలో ఏదీకూడా భారత దేశంలో రాష్ట్రాలను ఏర్పాటుచేయడానికి లేదా పునర్నిర్మించడానికి భాషప్రాతి పదికగా వుండాలన్నసూత్రాన్ని వ్యతిరేకించలేదు. కాకపోతే, ఇటు వంటి రాష్ట్రాలు కేంద్రాన్ని పటిష్టం చేయకపోగా బలహీన పరచ వచ్చునని మాత్రం హెచ్చరించాయి. ఉదాహరణకు, రాష్ట్రాల పునర్నిర్మాణ సంఘం ఈ విధంగా పేర్కొన్నది. "ఈ సమస్యను అన్నిదృక్కోణాల నుంచి కూలంకషంగా పరిశీలించినమీదట, కేవలం భాషా ప్రాతిపదికగా కానీ లేక సంస్కృతి ప్రాతిపదికగా కానీ రాష్ట్రాలను పునర్నిర్మించడం సాధ్యంకాదనే నిశ్చయానికి మేము వచ్చాము. జాతీ యైక్యత ప్రయోజనం దృష్ట్యా ఈ సమస్యకంతటికీ ఒక సమన్వయ మార్గాన్ని అనుసరించడం అవసరమని మేము భావిస్తున్నాము. లోగడ ఈ అంశాన్ని పరిశీలించిన ధార్ కమిషను, జె.వి.పి కమిటీల వంటి సంఘాలన్నీ ఈ సమస్య విషయంలో ఈ ఏకైక ప్రాతిపదిక దృక్పథాన్ని వ్యతిరేకించాయి.

అయితే రాష్ట్రాల పునర్నిర్మాణ సంఘం నివేదిక తరువాత బొంబాయి, బెంగాలు, అస్సాంలో జరిగిన సంఘటన భాషా ప్రాతిపదికపైగాక మరేయితర సూత్రాల ఆధారంగా రాష్ట్రాల పునర్నిర్మాణం జరిగినప్పటికి పరిణామాలు మరోవిధంగా వుండ గలవనీ, కడపటికి భాషా సూత్రం ఒక్కటే పరిష్కారమార్గం కాగలిగిందనే విషయాన్ని వెల్లడిస్తాయి. ఈ పథకాన్ని అమలు పరచడానికి తీసుకున్న నిర్ణయం సమర్థనీయమేనని తేలింది. కొన్ని ప్రాంతాలలో సంకుచితమైన ప్రాంతీయతత్వం, భాషా తత్వంతో ఏవో ఆందోళనలు జరిగినప్పటికీ జాతీయ సమైక్య తకు భంగం వాటిల్లలేదు.

రక్షణలు అమలు జరగడం ప్రధానం

1961-62లో విశాలాంధ్ర రాష్ట్రం ఏర్పడవచ్చునని రాష్ట్రాల పునర్నిర్మాణ సంఘం సిఫార్సుచేయగా కొద్దిమార్పుతో 1956లోనే ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటుచేసినప్పటికీ, దీని నిర్మాణా నికి ప్రాతిపదిక అయిన భాషాసూత్రం జాతీయ సమైక్యతను బలహీన పరచలేదని వెల్లడైంది. ఇటీవల ఏర్పడిన అవాంఛనీయ మైన పరిణామాలు ఒక వెనుకబడిన ప్రాంతానికి యిచ్చిన రక్షణల పూర్తిఅమలుకు మాత్రమే సంబంధించినవి విధానంతో వీటికి ఎట్టి ప్రమేయం లేదు.

భారత దేశంలో రాష్ట్రాల ఏర్పాటుకు భాష అతిముఖ్యమైన బంధం. అయితే యీ భాషాభిమానం అనేది ఇతర భాషా ప్రాంతాల వారిని ద్వేషించడానికి కారణం కాగూడదు. భాషరీత్యా అల్ప సంఖ్యాకుల హక్కులను అలక్ష్యం చేయడానికి తావివ్వ గూడదు. మరోవిధంగా చెప్పాలంటే భాషరీత్యా అధిక సంఖ్యా కులైన వారు అల్పభాషా సంఖ్యాకులపై ఆధిపత్యం వహిస్తున్నారనే భావానికి తావివ్వగూడదు. ఈ విషయంలో ఆంధ్ర ప్రదేశ్ పాత్ర అతి ప్రధానమైనది. ఎందుకంటే, తెలుగు మాట్లాడే వారి నందరిని ఒకే పరిపాలనా వ్యవస్థ క్రిందకు తెచ్చి ఆంధ్ర ప్రదేశ్ తాల భాషా రాష్ట్రమే మిగతా వాటికి ఆదర్శమైంది కనుక. భారత దేశం వంటి బహుభాషా ప్రాంతాలుగల దేశంలో ఆయా ప్రాంతాల పరిపూర్ణ సాంస్కృతిక వికాసానికి భాషారాష్ట్రాల ఏర్పాటే తగిన మార్గమని ఆంధ్ర ప్రదేశ్ మిగతా దేశానికి నిరూపించి చూపించ డమే గాక ఒక వైపు జాతీయ సమైక్యతను పరిరక్షిసూ మరో వైపు భాషా అల్ప సంఖ్యాక వర్గాల అభిరుచులను సంరక్షిస్తూ భాషాప్రాతి పదిక సిద్ధాంతాల మూల సూత్రాన్ని విజయ వంతంగానూ, పరి పూర్ణంగానూ అవగాహన చేసుకుని ఆచరణలో నిరూపిస్తున్నది.

పరిపాలనలో ప్రజల పాత్ర

ఎప్పుడైనా ప్రపంచంలో ఎక్కడైనా భాష అనేది ప్రజల మధ్య వారిని సన్నిహిత పరచే బలీయమైన సూత్రంగా వుంటూ వచ్చింది. బహు భాషలతోకూడిన భారత దేశం వంటి ప్రజా స్వామిక వ్యవస్థలో ఆ ప్రజలు మాట్లాడేభాషలోనే వారికి అర్థమయ్యే భాషలోనే పరిపాలన నిర్వహింపబడినప్పుడే ఆ పరిపాలనలో ప్రజలు ఎక్కువగా పాల్గొనడానికి వీలవుతుంది. 1928 లో అఖిల పక్ష సమావేశానికి సంబంధించిన నెహూ్రు కమిటీ ఈ సూత్రాన్నే యిలా నొక్కి చెప్పింది—

" ఒక రాష్ట్రం తనదైనందిన వ్యవహారాలను తన స్వంత భాషలో కొనసాగించాలంటే ఆ ప్రాంతం తప్పనిసరిగా భాషా ప్రాంతమై వుండాలి. ఒక వేళ అది బహు భాషా ప్రాంతమై వున్నట్టైతే తరచుగా అనేక యిబ్బందులు తలెత్తుతాయి. విద్యా బోధనా, పరిపాలనా నిర్వహణ పనులు రెండు గాని, అంతకు ఎక్కువ గాని భాషల్లో కొనసాగించ వలసి వస్తుంది. అందువల్ల రాష్ట్రాలను భాషా ప్రాతిపదిక మీద పునర్వ్యవస్థీకరించడం ఎంత యినా అభిలషణీయం. భాష అనేది ఆయా సంస్కృతులకు, సాంప్రదాయాలకు, సాహిత్యానికీ అనుగుణంగా ప్రతిబింబిస్తుం టుంది. భాషా ప్రాతి పదికగా ఏర్పడిన ప్రాంతంలో యివన్నీ ఆ ప్రాంతపు సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడతాయి.

ఆంధ్ర ప్రదేశ్ (ఆంధ్ర ప్రదేశ్ ఏమిటి యితర రాష్ట్రాలు కూడా) ఈ ప్రాతి పదిక సిద్ధాంతంమీద ఏర్పాటైనప్పుడు అవెంటనే తీసుకోవలసిన చర్య ఒకటి వుంది. ఈ విధంగా రాష్ట్రం ఏర్ప డ్డానికి ప్రాణ సదృశమైన అంశం ఏదైతే వున్నదో ఆ అంశాన్ని అంటే ఏక భాష ప్రజలను ఏకత్రాటి మీద నడపగలదన్న అంశాన్నిగుర్తించి దానిని ఆచరణలో పెట్టి తెలుగు భాషను పరి పాలనా భాషగా చేయడానికి సాధ్యమైనంత త్వరగా తగు చర్యలను తీసుకోవలసి వుంది.

ఇది చాలా ముఖ్యమైన అంశం. ఇలా జరిగివుంటే 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డంలోగల లక్ష్యం నెరవేరివుండేది. అయితే ఈ విషయంలో కొంత అలస్యం జరిగింది. ఇప్పటికీ జరుగుతునేవున్నది. ప్రస్తుతం మనం చూస్తున్న ఆంధ్ర తెలంగాణా ప్రజలమధ్య యీ భావోద్రేకాలకు ఒక విధంగా యిదే దారితీసిందనవచ్చు. అధికార భాషావిధానాన్ని ఎందుకు అమలుచేయడం జరుగలేదో,

లేదా కొంతమేరకు మాత్రమే ఎందుకు అమలు చేయటమౌతున్న దో అన్న విషయాన్ని ఇప్పటికైనా మనం కూలంకషంగా పరిశీలించి సాధ్యమైనంత త్వరగా లోపాల్ని తొలగించుకోవలసి వుంది. ఇరు ప్రాంతాలలోని సామాన్య ప్రజానీకం ఈ విధానానికి హర్షామోదం తెలుపగలరు. రాష్ట్రంలోపల వివిధ ప్రాంతాలమధ్య సమైక్యశక్తులు మరింత బలపడగలవు.

రెండవ అధికారభాష - ఉర్దూ

గతంలో జరిగినది ఏదైనా యీనాడు మాత్రం రాష్ట్రం క్లిష్టసమస్యను ఎదుర్కొవలసి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం అధికార భాషా విధానంలో తీసుకోవలసిన అన్నిచర్యలను తీసుకుని విజయవంతం చేయడమేగాక అల్పసంఖ్యాక భాషావర్గాలవారి-ముఖ్యంగా ఉర్దూ మాట్లాడే ప్రజల ప్రయోజనాలను పరిరక్షించడం కూడా అవసరం. ఉర్దూను రెండవ అధికార భాషగా నిర్ణయం తీసుకోవడం సముచితమైనచర్యే. అయితే యీ అల్పసంఖ్యాక భాషా వర్గంవారు కూడా రాష్ట్రఆర్థిక సాంస్కృతిక, సాంఘిక జీవితంలో భాగస్వాములేనన్నది నిర్వివాదం.

భాషా సమైక్యత సాధించబడినప్పుడు, అధిక, అల్పభాషా సంఖ్యాకుల మధ్య పరస్పరం అవగాహన, సహకారం దృఢతరమవుతుంది. అప్పుడు ఆర్థిక, రాజకీయ పరిపాలనా సమైక్యత బలపడుతుంది. అప్పుడు ఒకరినొకరు ద్వేషించుకోవడం, ఒకరినొకరు అనుమానించడం తొలగిపోతుంది.

ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలు ఒకే భాషను మాట్లాడడం చేత యీ యిరువురిని ఒక్కటిగా కలిపివుంచిన, అనాదిగా శతాబ్దాల తరబడి కలిపి వుంచుతూవున్న భాషా బంధుత్వాన్ని త్రెంపివేయడం సాధ్యంకానిది. ఏవో పరిపాలనా సంబంధమైన, లేదా రాజకీయమైన భిన్నాభిప్రాయాలు కుటుంబంలో వచ్చే తాత్కాలిక పొరపొచ్చాలవంటివి. భాషా ప్రాతిపదిక సమైక్యతను విచ్ఛిత్తి చేయడానికి కారణం కారాదు.

తుఫాను బాధితులకు సహాయం

తుఫాను వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో నివారణ చర్యలకోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసిన రు 5 కోట్లలో ఖమ్మంజిల్లాకు రు 76 లక్షలు, రు 20 లక్షలు పశ్చిమగోదావరి జిల్లాకు, రు 124 లక్షలు కృష్ణాజిల్లాకూ, రు 273 లక్షలు గుంటూరుజిల్లాకూ కేటాయించారు. ధనరూప సహాయం, పశుపోషణ, ప్రజారోగ్య కార్యక్రమాల నిర్వహణ, సేద్యపు నీటి పారుదల వనరులు, రోడ్ల మరమ్మతులు, తుఫాను దెబ్బతిన్న ప్రాంతాల్లో అసలుధరకు విత్తనాలు సప్లై చేయుటలో రవాణా మొదలగు ఖర్చులకూ యీ మొత్తాలను వెచ్చిస్తారు.

తుఫానువల్లగాని వరదలవల్లగానీ మరణించినవారి కుటుంబీకులకు, ఒక్కొక్క కుటుంబానికి రు 500 నుండి వెయ్యి రూపాయలదాకా ధన సహాయం జరుగుతుంది. ఇండ్లు కూలిపోయినవారికి రు 50 నుండి 200 వరకు సహాయం అందజేస్తారు. పడవలు, చేపలు పట్టుకునే సామగ్రి వగైరా నష్టపోయినవారికి కూడా కలెక్టర్లద్వారా ధనసహాయం జరుగుతుంది. అలాగే చేనేతపనివారు, ఆల కాపరులకుకూడా సహాయం అందిస్తారు. ఈ ధనసహాయం గుంటూరుజిల్లాలో రు 153 లక్షలు, కృష్ణాలో రు 22 లక్షలు, పశ్చిమగోదావరిలో రు 2 లక్షలు, ఖమ్మంజిల్లాలో రు 31 లక్షల వరకు జరుగుతుంది. పశువులకోసం, ప్రజారోగ్య కార్యక్రమాలకోసం కృష్ణా, పశ్చిమగోదావరి, ఖమ్మంజిల్లాలలో రు 2 లక్షల వంతున, గుంటూరులో రు 5 లక్షలు ఖర్చు జరుగుతుంది.

సేద్యపు నీటిపారుదల వనరులు, రోడ్ల మరమ్మతులకోసం ఖమ్మంజిల్లాలో రు 43లక్షలు పశ్చిమగోదావరిలో రు 16 లక్షలు, కృష్ణాలో రు 100 లక్షలు, గుంటూరుజిల్లాలో రు 177 లక్షలు ఖర్చుపెడతారు.

మహాభారతము

తిరుపెగంటుల లక్ష్మీనాశాస్త్రి

అర్జునుడు ఇంద్రలోకమునకు దివ్యాస్త్ర సంపాదనమునకై పోయిన సంగతిని ధృతరాష్ట్రుడు వేదవ్యాస మహామునివలన విని సంజయునితో నిట్లనెను:— "మూర్ఖుడైన నా కొడుకు దుర్యోధనుడు విషయోపభోగములలో తగుల్కొని సమస్త భూమండలమునే నశింపజేయగలడు. ఏ మహాపురుషుడు పరిహాసములోగూడ సత్యమునే పలుకుచుండునో, ఎవని వైపున యుద్ధము చేయుటకు అర్జునునివంటి వీరుడు కలడో అట్టి ధర్మజునకు కౌరవరాజ్యముపై అధికారము వహించుట యెంతపని? ఆతడు త్రైలోక్య రాజ్యమునుగూడ ఏలగలవాడు. తీక్ష్ణములయిన 'కర్ణి' బాణములను విడుచు అర్జునుని ఎదిరించగలవారు ఎవరునులేరు. తుదకు ముసలి తనమేలేని మృత్యువుకూడ అతని నెదిరించజాలదు సుమా? అట్టి అర్జునుడు బాసటగాగల పాండవులతో పోరాడి, నా పుత్రులు తప్పక మృత్యువువాత బడెదరు. మనవారిలో ద్రోణ, కర్ణ, భీష్ములు మాత్రమే అతనిని ఎదిరించు పోరాడగలరు. కాని వారి విషయములోగూడ నాకు సంశయము గలదు. ఎందుకనగా కర్ణుడు దయా వివేకాక పొరపాట్లుగూడ చేయుచుండును; భీష్ముడు, ద్రోణాచార్యుడు వృద్ధులు, అందరికీని గురువులు. అర్జునుడో బలవంతుడు, క్రోధామర్షములు కలవాడు. దృఢమైన పరాక్రమముతో ప్రయత్నించువాడు. గనుక పాండవులు ఓడిపోవుటకల్ల. వారు సమస్త భూమండలాధిపత్యమును గూడ వహించుటకు అర్హులు. మా వారు గాన లేక అర్జునుడుగాని నశించినప్పుడే ఈ వివాదము శాంతిల్లును. అర్జునుని వధించువాడుగాని లేక ఓడించువాడుగాని ఎవడునులేడు. కనుక వీరిపైన అతనికిగలిగిన కోపము ఎట్లు శాంతిల్లును. అతడు ఖాండవవనమును దహించెను. రాజులనందరను జయించి రాజసూయమును చేసెను. పర్వతము పైనబడిన వజ్రాయుధమైనను కొంత మిగిలించునుగాని, అర్జునుని బాణహతులయినవారెవరును మిగులరు. సూర్యకిరణములు ప్రపంచమును తపింపజేసినట్లు పార్థుని బాణములు నా కొడుకులను తపింప జేయగలవు. అతని రథ ధ్వని వినగానే కౌరవ సేన యంతయు ఛిన్నాభిన్నమై చెదరిపోవును. అర్జునుడు ధనుర్బాణధారియయి యుద్ధరంగములోనిలిచినపుడు, దైవము సర్వహరుడైన మరియొక యముని సృజించి యుంచెనా యనునట్లు చూచివారికి తోచును." అని చెప్పెను.

ధృతరాష్ట్రుడు చెప్పిన మాటలు విని సంజయుడు ఇట్లనెను: "రాజా! నీవు చెప్పినదంతయు సత్యమే. ద్రౌపదిని సభలోకి ఈడ్చి అవమాన పరచినప్పటి క్రోధము వారి మనస్సులో నెప్పటికిని చల్లారదు. అర్జునుడు యుద్ధములో ఏకాదశ శరీరములుగల శివుని సంతుష్టుని జేసెను. అప్పుడు రాజులెవరికిని లభ్యముగాని సమస్త లోకపాలు దర్శనము అతనికి లభించెను. శివునకుగూడ అసాధ్యుడైన అర్జునుని జయించుట ఇతరులకు సాధ్యమా? "పదమూడేండ్లు గడచిన తరువాత నీ తొడలు భేదించెద" నని దుర్యోధనునితో భీముడు చేసిన ప్రతిజ్ఞను ఎవరాపగలరు. పాండవులందరు అస్త్రవిద్యకోవిదులు. వీరులు, దేవతలకుగూడ అసాధ్యులు. వారు తప్పక యుద్ధములో నీ పుత్రులను హతమార్చెదరు" అని చెప్పెను. ఆ మాటలు విని ధృతరాష్ట్రుడు "సంజయా! కర్ణుడు సభలో అన్ని బీరములు పలికెను గాని యేమి చేయగలడు? ద్రౌపదిని అవమాన పరచుటవలననే మనకు ఇంత ఆపద మూడినది. ఇప్పటికైనను నా సుతులు నా మాట వినరు. నేను అంధుడను, ఏమియు చేయజాలనని నన్ను నిర్లక్ష్యబుద్ధితో జూచెదరు. దుర్యోధనునకు మంత్రులైన కర్ణ, శకుని, దుశ్శాసనాదులుగూడ అతనిదోషములనే పెంచుచుందురు. అర్జునుడు స్వేచ్ఛగా విడిచిన బాణములచేతగూడ మా వారు దహింపబడుదురు. అట్లుండ అతడు కోపముచేత విడిచిన బాణములకు వీరు తట్టుకొనగలరా? అతని బాణములచేత దేవతలుగూడ నశింతురుగదా! పరమేశ్వరు

డైన కృష్ణుడే అతనికి బాసటగానుండగా అతడు నిర్జింపజాలని వారు ప్రపంచములో నుందురా? అతడు మహా దేవునితోనే బాహు యుద్ధము చేసిన మహావీరుడని విని మిక్కిలి ఆశ్చర్యము గలుగు చున్నది. కనుక నా పుత్రులు సపరివారముగా అర్జునుని క్రోధాగ్నికి బలికాక మానరని నా నిశ్చయము."

పై మాటలన్నియు విని జనమేజయుడు వైశంపాయన మునితో "మహాత్మా! దుష్కృత్యములనుచేయు పుత్రుని ఉపేక్షించుచు ధృతరాష్ట్రుడు ఇట్లు శోకించుట వ్యర్థముగదా! పాండవులు అడవిలో వన్యఫలమూలములు భుజించుచుండిరా? లేక దున్ని పండించిన ధాన్యాదులను తినుచుండిరా? వారి భోజన క్రమమును గూర్చి చెప్పుము." అని యడిగెను. వైశంపాయనుడిట్లు చెప్పెను: "పాండవులు వనములో వన్య ఫలములను, వన్యమృగములను బాణములతో పడగొట్టి వాటిని తొలుత బ్రాహ్మణులకు నివేదించి శేషించినదానిని భుజించుచుండిరి. వారితోపాటు వనములో అగ్నిహోత్రులు, బ్రహ్మవేత్తలు, సామాన్యులునైన పదివేలమంది బ్రాహ్మణులు నివసించుచుండిరి. వారికి పాండవులు, రురుమృగములను, లేళ్ళను, ఇతర పవిత్ర మృగములను తమ బాణములతో చంపి భోజనము నివేదించుచుండిరి. ఆ బ్రాహ్మణులలో నొక్కడు గూడ దుర్బలుడుగాని, భీతుడుగాని, రోగిగానిలేకుండెను. ధర్మజుడు సోదరులను ప్రియ పుత్రులవలె, బంధువులను సోదరులవలెను పోషించుచుండెను. ద్రౌపది పతులకు, బ్రాహ్మణులకు తొలుత భోజనముపెట్టి, పిదప మిగిలినదానిని తాను భుజించుచుండెను. పాండవులు వనములో నలు దిక్కుల సంచరించుచు దుష్టులను, క్రూరమృగములను సంహరించుచుండిరి. ఈ విధముగా అర్జునుడు స్వర్గములోనున్న ఐదు సంవత్సరములుగూడ తక్కిన నలుగురు సోదరులు, వేదాధ్యయనము. జపము, హోమము మొదలైన సత్కర్మములుచేయుచు కాలము గడుపుచుండిరి." అని చెప్పెను.

పై విధముగా వైశంపాయనుడు జనమేజయునకు చెప్పిన వృత్తాంతమును సంజయుడు ధృతరాష్ట్రునకు చెప్పగా నతడు పాండవుల మానవాతీతమైన చరిత్ర విని చింతచే, శోకముచే, కుములుచు దీర్ఘముగా వేడి నిట్టూర్పులు విడిచి సంజయునితో నిట్లనెను :

"సంజయా! జూదమువలన నేర్పడిన ఘోరమును చింతించుచు నాకు రాత్రింబవళ్లు శాంతిలేక బాధపడుచున్నాను. పాండవుల వీర్యము ఓర్వజాలనిది. వారికి అనన్య సామాన్యమైన భ్రాతృప్రేమ కలదు. నకుల సహదేవులు ఆయుధములను తీసుకొని భీమార్జులను ముందిడుకొని యుద్ధరంగమునందు నిలుచుండగా ఆ నలుగురి ముందున్న, మావారిలో నొకడుగూడ మిగలరు. ఇది తథ్యము. వారికి వృష్ణి, పాంచాలాదులు సహాయకులు. విశేషించి భగవంతుడగు కృష్ణుని కృపాదృలు వారియందు కలదు. వారందరు నా నూర్గురు పుత్రులను దహించివేయగలరు. వారిమధ్య తీక్ష్ణాగ్రము గల గదను భీముడు, పిడుగుధ్వనివంటి టంకారముగలగాండీవమును అర్జునుడును ధరించియుండగా శూరు లెవరును వారియెదుట నిలువ జాలరు. దుర్యోధనుని వలలో చిక్కుకొని నేను, మిత్రులు పూర్వము చెప్పిన హిత వాక్యములు విననైతిని. అవి జ్ఞప్తికి తెచ్చుకొని యుద్ధసమయములో దుఃఖించెదను." ఆ మాటలు విని సంజయు డిట్లనెను :

"రాజా! నీవు పుత్ర ప్రేమచేత చాల తప్పు చేసితివి. పాండవులు జూదములో నోడిన సంగతి కృష్ణుడు విని వనమునకు పోయి వారిని ఊరడించెను. అప్పుడు దుఃఖితులైయున్న పాండవులు యుద్ధములో తమకు సారథ్యము చేయుమని కృష్ణుని కోరిరి. అతడు అంగీకరించెను. వారికి కలిగిన దుర్దశనుచూచి చింతించుచు 'వంగ, చోళ, ద్రవిడ, ఆంధ్రాది దేశముల వీరులు.' ద్రుపద పాంచాలాదులు తోడుకాగా వెంటనే వెడలి కౌరవులను నిర్జించి ధర్మరాజా! నీ రాజ్యమును నీకిప్పించెదను. అని కృష్ణుడు చెప్పెను. ధర్మజుడు దానికి అంగీకరించక "కృష్ణా! పన్నెండేండ్లు వనవాసము పదమూడవయేడు అజ్ఞాతవాసము చేయుటకు ప్రతిజ్ఞచేసితిని. కనుక నా మాట తప్పను. ఈ పదుమూడేండ్ల తరువాత నీవు చెప్పినట్లే చేసి శత్రువులను హతమార్చెదను." అని చెప్పగనే అతని ధర్మబుద్ధికి అక్కడివారందరు అతనిని ప్రశంసించిరి. వారు అక్కడ దుఃఖించుచున్న పాంచాలనిగూడ ఊరడించిరి. ఆమెను అవమానపరచిన వారి రక్తమాంసములు యుద్ధభూమిలో గ్రద్దలు తినగలవు అని చెప్పిరి. కనుక ధృతరాష్ట్ర మహారాజా! కృష్ణ, బలరామ, భీమ, అర్జున, ద్రుపద, పాంచాలాది యోధులను జీవితముపైన ఆశగలవా డెవడును ఎదిరించజాలడు." ఆ మాటలు విని ధృతరాష్ట్రుడు "సంజయా! నీ విపుడు చెప్పిన నీతి వచనములనే ద్యూతకాలమునందు విదురుడు చెప్పెను. కాని నేను పెడచెవిని పెట్టితిని. ఇప్పుడు తత్ఫలితమును అనుభవించుచున్నాను." అనెను.

(సశేషం)

బహుముఖ ప్రజ్ఞాశాలి

శ్రీ. శే. గిడుగు వేంకట సీతాపతి



అధ్యాపకుడు, భాషా తత్త్వవేత్త, పరిశోధకుడు, ప్రజా సేవకుడు, కవి, పండితుడు, నటుడు, సంగీత నాట్య కళా భిజ్ఞుడు, నిఘంటు పరిష్కర్త, విజ్ఞాన సర్వస్వ సంగ్రాహకుడు, సంపాదకుడు, బాలసాహితీ పథ ప్రదర్శకుడు—ఇన్ని విధాల పేరు పొందిన డాక్టర్ గిడుగు వేంకట సీతాపతి ఆరు దశాబ్దాలపాటు దేశానికి సేవచేసి తమ 84 వ ఏట హైదరాబాద్‌లో ఏప్రిల్ 19 వ తేదీని పరమ పదించారు.

వ్యావహారిక భాషావాద ప్రవర్తకుడైన గిడుగు పిడుగు రామమూర్తి పంతులు కుమారుడే సీతాపతి. తండ్రికి కుమారుని వల్ల లభించిన సహాయం అనల్పమైనది. వ్యావహారిక భాషా ప్రచారంలోనే కాదు, సవర భాషకు లిపి, నిఘంటువు, వ్యాకరణం కల్పించడంలో కూడ సీతాపతి తన తండ్రి గారికి ఎంతో తోడ్పడ్డారు.

సీతాపతి పర్లాకిమిడి హైస్కూలులో ఉపాధ్యాయులుగా వృత్తి జీవితం ప్రారంభించారు. తరువాత ఆ కళాశాలలో ఉపన్యాసకుడయ్యారు. ఆ కాలంలోనే అయన తామ్ర శాసనాలను పరిశీలించారు. ఆంధ్ర దేశంలో ఆంత్ర పాలజి (మానవశాస్త్రం) పరిశోధన చేసిన మొదటివారు ఆయనే.

కొత్తగా ఒరిస్సా రాష్ట్రం ఏర్పడబోతున్న సమయంలో తెలుగువారు అధిక సంఖ్యాకులుగా ఉన్న పర్లాకిమిడి తాలూకాను ఆరాష్ట్రంలో కలిపివేసే ప్రయత్నం జరుగుతున్నప్పుడు సీతాపతి లండన్ వెళ్లి పార్లమెంటరీ సంఘం ఎదుట సాక్ష్యం ఇచ్చి వాదించారు. ఆయన కృషి ఫలితంగా పర్లాకిమిడిలో కొంతభాగమైనా ఒరిస్సాలో కలియకుండా నిలిచింది.

సీతాపతి 1938 నుంచి 1947 వరకూ మదరాసులో సినిమాలలో నటించారు. రైతుబిడ్డలో జమీందారుగాను, ఇల్లాలులో నాయిక తండ్రిగాను, భక్తిమాలలో రామానుజాచార్యులుగాను, పంతులమ్మలో మ్యునిసిపల్ చేర్మన్‌గాను, స్వర్గసీమలో ఆఫీసు మేనేజరు గాను, మాయాలోకంలో మంత్రిగాను, పల్నాటి యుద్ధంలో ఒక వీరుడుగానూ నటించారు.

తెలుగు భాషా సమితి ప్రచురించిన విజ్ఞాన సర్వస్వానికి సీతాపతి ప్రధాన సంగ్రాహకులుగాను, చరిత్ర రాజనీతికి సంబంధించిన మొదటి సంపుటానికి సంపాదకులుగాను పని చేశారు. సూర్య రాయాంధ్ర నిఘంటువు చివరి మూడు సంపుటాలు పూర్తి చేశారు.

1909 నుంచి ఆయన బాల సాహిత్యానికి దోహదం చేస్తూ వచ్చారు. ఆయన రచించిన చిలుకమ్మ పెండ్లి, రైలుబండి, ఎలుక పిల్లి మొదలైన బాలగీతాలు ప్రసిద్ధమైనవి. ఆయన కృషికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆయనను బహూకరించాయి.

విస్తృత పరిశోధన ఫలితమైన 'తెలుగులో ఛందోగతులు' అనే ఆయన గ్రంథం రాష్ట్ర సాహిత్య అకాడమి బహుమానాన్ని' పొందింది.

ఆయనకు నాటక, నృత్య, సంగీతాలలో అభినివేశం ఉంది క్షేత్రయ్య పదాలలో కొన్నిటిని ఆయన సంస్కృతంలోకి గేయాలుగానే అనువదించారు.

ఆయన సాహిత్య సేవను గుర్తించి ఆంధ్ర విశ్వవిద్యాలయం కళా ప్రపూర్ణ బిరుదంతో ఆయనను సత్కరించింది.

ఆయన సంస్కృత శైలి సరళమూ, హృద్యమూ.

చీమలు పెట్టిన పుట్టలు పాములకిరవైనయట్లు పామరుడు తగన్
హేమంబు కూడబెట్టిన భూమీశుల పాలజేరు భువిలో సుమతీ

అనే సుమతీ శతకపద్యానికి ఆయన సంస్కృత అనువాదం ఆయన శైలికి ఉదాహరణం ,

పిపీలికా నిర్మిత వామలూరః సర్పస్యగేహం భవతి క్రమేణ
తథైవ లుబ్ధైః చిరకాలగుప్తం స్వర్ణంచ గచ్ఛత్యవనీశకోశమ్.

పరిణతప్రజ్ఞాశాలి , తెలుగు పెద్ద ఐన డాక్టర్ సీతాపతికి జోహారులు.

—ఎన్. శివనారాయణ



ఆంధ్రప్రదేశ్‌లో కనీవినీ ఎరుగని

తుఫాను బీభత్సం




ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరంలో ఇటీవల సంభవించిన తుఫాను లెక్కగట్టలేనంత తీవ్రమైనదని కేంద్ర విద్యుచ్ఛక్తి, నీటి పారుదలమంత్రి శ్రీ డా. కె. ఎల్. రావు పేర్కొన్నారు.

నలభై నాలుగు యేళ్ళ క్రిందట 1925 మే 16 న ఇటువంటి తుఫానే ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిందనీ, ఇటీవల సంభవించిన తుఫానుకూడా సరిగా యిదే తేదీన రావడం విశేషమని ఆయన న్నారు. అయితే 1925 లో వచ్చిన తుఫానులో ఇప్పుడు జరిగినంత ఎక్కువగా ప్రాణనష్టం సంభవించలేదని తెలియజేశారు

అప్పుడు యింత జనాభా లేదు. కాలం గడిచేకొద్దీ జనాభా పెరిగి ఖాళీ భూములను ప్రజలు ఆక్రమించుకోవడం జరిగింది.

తుఫాను కదలికపై వాతావరణ పరిశోధకుల హెచ్చరికనుగూర్చి ప్రస్తావిస్తూ యీ పరిశోధకులు, సముద్ర తీరానికి 350 మైళ్ళ దూరంలో తుఫాను వున్నట్టు మే 1[illegible]న గుర్తించారనీ, ఈ తుఫాను





ఒంగోలుతీరాన్ని మే 17 న తాకింది. సాధారణంగా తుఫాను ఏదో ఒక తీరాన్ని తాకి ఉత్తరంగా మళ్ళి చెదిరి బలహీనపడిపోతూ వుంటుందనీ. అయితే ఇటీవల తుఫాను మాత్రం ఒకేచోట మూడు రోజులు తిష్టవేసుక్కూచుందనీ ఆయన తెలియజేశారు.

అందుకే యీ తుఫాను యింత భారీఎత్తున నష్టాన్ని చేకూర్చిందని అన్నారు. వర్షాలుకూడా విపరీతంగాపడ్డాయి. ఈ తుఫాను ఇంత ఎక్కువగా వుంటుందని వాతావరణశాస్త్రజ్ఞులుకూడా భావించలేదు

రాడార్ విధానం లేకపోవడంవలనే యింత విపరీత నష్టంవాటిల్లినట్లు ఆయన పేర్కొన్నారు

భవిష్యత్తులో యీ విధమైన తుఫానులను ముందుగా కనుగొనడానికి ఏంచేయాలో విజయ తాను వాతావరణ పరిశోధక అధికారులతో చర్చలు జరుపనున్నట్లు పేర్కొన్నారు.

మద్రాసులోనూ, విశాఖపట్టణంలోనూ రాడారును నెలకొల్పాలన్న ప్రతిపాదనలు వున్నట్లు యీ సందర్భంలో ఆయన తెలియజేశారు.



పంటలకూ ప్రాణాలకూ అపారనష్టం

ముందు జాగ్రత్త రాడార్ ప్రతిపాదనలు





విద్యార్థులకు గాంధీజీ ప్రబోధాలు

ఇది ఆదర్శాలు, లక్ష్యాలస్థాయి పెరుగుతున్న యుగం. అనేక వర్గాలు అభిప్రాయపడుతున్నారు. తమ కోర్కెలు తీర్చాలని, తమ హక్కులకు రక్షణ కల్పించాలనీ ప్రజలు ఆందోళన చేస్తున్నారు. అయితే ఇదంతా కేవలం ఒక్క విద్యార్థిలోకానికి పరిమితం కాలేదు. కాని విద్యార్థులకు ప్రత్యేకహక్కులు, సదుపాయాలు. విద్యార్థులంటే ప్రత్యేకమైన గౌరవాదరణలు ఉన్నాయి. అందువల్ల వారిమాటలకూ, చేతలకూ ప్రత్యేక ప్రాధాన్యం ఉన్నది. అందువల్లనే వారు అందరి దృష్టినీ ఆకర్షిస్తారు.

సహాయ నిరాకరణ జరుగుతున్న రోజులలో గాంధీ మహాత్ముడే స్వయంగా విద్యార్థులకు మామూలు పాఠశాలలకూ, కళాశాలలకూ పోవడం మానివేయమనీ, గ్రామాలలో నిర్మాణ కార్యక్రమాలలో పాల్గొనమనీ, ఆనాడు దేశంలో ఆయా ప్రాంతాలలో నెలకొల్పబడుతున్న జాతీయ విద్యా సంస్థలలో చేరమనీ పిలుపు ఇచ్చారు.

పరాయి ప్రభుత్వం ఉన్నప్పుడు పెద్దఎత్తున ప్రజలు అందరూ సహాయ నిరాకరణ ఉద్యమం జరుపుతున్న సందర్భంగా గాంధీ విద్యార్థులకు అలాంటి సలహా ఇచ్చారు. అప్పుడు విద్యార్థులు ఉద్యమంలో పాల్గొనడానికి జాతిపిత అనుమతి లభించింది. కాని ఇప్పటి పరిస్థితి వేరు. జాతీయ ప్రభుత్వం ఏర్పడిన నేటి పరిస్థితికీ ఆనాటి పరిస్థితికీ చాల తేడా ఉన్నది. ఆనాడు అనుసరించిన విషయం ఈనాడు అనుసరించడానికి వీలుండక పోవచ్చును. గాంధీ మేధావులను గురించి ప్రత్యేకించి ఏమీ చెప్పలేదు. ఆయన మేధావులు మామూలు ప్రజానీకం కంటె భిన్నమైన వర్గంగా, ఒక ప్రత్యేక వర్గంగా భావించారు. 1934 ఆగస్టు 3వ తేదీనాటి వార్తాపత్రికలో ఆయన హింసాత్మకమైన ఆందోళనలు ఎక్కడ బయలుదేరినా అవి ప్రజలు తమంతటతాముగా ప్రారంభించిన ఆందోళనలు కావనీ, వాటికి మేధావి వర్గం ప్రోత్సాహం ఉండి ఉంటుందనీ తాను భావిస్తున్నానని వ్రాశారు. 1927లో కాశీలో విద్యార్థుల సమావేశంలో గాంధీ తమ ప్రసంగంలో విద్యార్థుల చదువులకు అయ్యే ఖర్చులు ఏనాడూ అటువంటి విద్యాధ్యయనానికి అవకాశం లేని గ్రామీణ ప్రజలు భరిస్తున్నారనీ, బీదలకు అందుబాటులో లేని చదువులు మానుకోవడం విద్యార్థుల విధి అనీ. అయితే ఆనాడు ఆ పని చెయ్యమని తాము కోరడం లేదనీ, గ్రామప్రజలకు సేవ చేయడం ద్వారా వారి ఋణంలో కొంత ఐనా తీర్చమని మాత్రమే కోరుతున్నామనీ అన్నారు. గాంధీ ప్రసంగం జరిగిన నాటికంటె ఈనాడు విద్యకోసం ప్రభుత్వధనం ఎన్నోరెట్లు ఎక్కువగా వ్యయం అవుతున్నది. చతుర్థ ప్రణాళికలో విద్యావ్యాప్తి కోసం రూ. 809 కోట్ల మేరకు కేటాయించాలని నిర్ణయించారు. ఇందులో రూ. 259 కోట్లు కేంద్ర రంగంలోను రూ. 550 కోట్లు వివిధ రాష్ట్రాలలోనూ వ్యయం చేయాలని ఉద్దేశిస్తున్నారు. అంటే విద్యార్థులు ముఖ్యంగా ప్రజలకు ఈ మేరకు ఋణపడుతున్నారనే అనుకోవచ్చును. కాగా వారికీ ఋణం విద్యార్థులు ఎలా చెల్లించుకోగలరు.

ఈ ప్రశ్నకు సమాధానంగా గాంధీ మహాత్ముడు విద్యార్థులకు ఋణవిముక్తి మార్గం ఉపదేశించారు. ప్రాతిపదిక విద్యా విధానం వల్ల విద్యార్థులు జాతి సంపద అభివృద్ధి చెందడానికి దోహదం కల్పించవచ్చుననీ, ఈ నూతన విద్యా విధానంవల్ల విద్యార్థులు ప్రజలకు ఋణపడి ఉండవలసిన స్థితి తప్పుతుందనీ గాంధీ సూచించారు. విద్యార్థులందరూ ఏదో ఒక వృత్తివిద్య అభ్యసించిన పక్షంలో, పాఠశాల స్థాయిలనుంచే వృత్తివిద్య ప్రాతిపదికపై వారు విద్యఅభ్యసించిన పక్షంలో ప్రభుత్వ ధనం ఎంతో ఆదా కావడమే కాకుండా కాయకష్టం పట్ల గౌరవాభిమానాలు కల క్రొత్త తరం విద్యార్థులు రంగంలోకి వస్తారు. ఆ తర్వాత వారు కళాశాలలలో కాయకష్టం చేయడానికీ, తెలివితేటలు పెంపొందింప చేసు

కోడానికి. హృదయ వికాసానికి అన్ని విధాలా కృషిచేయడానికి వీలవుతుంది. గాంధీ మేధావి వర్గానికి, వ్యతిరేకం అనడానికి వీలు కాదు, అది వాస్తవంకాదు. అయితే జీవితానికీ, కాయకష్టానికీ దూరమైన చదువులంటే ఆయనకు సుతరామూ గిట్టదు. విద్యార్థులు పలుగూ పారా, చీపురూ బుట్టా పుచ్చుకొని పనులు చేయడానికి పూనుకోవాలనీ ఆ విధంగా ప్రజలఋణం తీర్చుకోవాలనీ ఆయన అభిప్రాయం. విద్యార్థులు సెలవులలో గ్రామాలకుపోయి పారిశుద్ధ్యం గురించి బోధింపవచ్చును; వివిధ రంగాలలో సేవ చేయవచ్చును. హరిజనాభివృద్ధికై కృషిచేసి వారిమైత్రి సంపాదింపవచ్చును. గ్రామ ప్రజలతో ఇంటువంటి సన్నిహితమైన ప్రత్యేకమైన స్నేహ సంబంధాలు కల్పించుకోడానికి వీలుగా ఖద్దరు ప్రచార కార్యక్రమం రూపొందించబడింది. దీనికితోడు వారంలో కొన్నిగంటలు సాంఘిక సేవ కార్యక్రమాలకు ప్రత్యేకించవచ్చును. సాయం పాఠశాలలు, ఔషధాలయాలు వంటివి విద్యార్థులు స్వచ్ఛందంగా నిర్వహించడానికి వారి సొంతసొమ్ములో కొంతభాగం వెచ్చించ వచ్చును.

దేశంలో మతకలహాలు, అంతఃకలహాలు వచ్చిన సమయంలో వివిధ మత, కులవర్గాల ప్రజలమధ్య సామరస్యం సాధించడానికి విద్యార్థులు శాంతి దళాలలో చేరి ఎంతైనా కృషి చేయవచ్చును. విద్యార్థులు కులదురభిమానం విడనాడాలనీ, అనవసరపు దుబారా ఖర్చులు మానుకోవాలనీ, వివాహాదులు అతి నిరాడంబరంగా జరగాలనీ, కులాంతర, మతాంతర వివాహాలు విరివిగా జరగాలనీ ఆయన అనేక సందర్భాలలో హితబోధచేశారు. గాంధీ మహాత్మునకు భారతీయ భాషలపట్ల అభిమానం మెండు. అందులోనూ హిందూ ముస్లిమ్ సమైక్యతకు చిహ్నంగా కన్పించే హిందూస్తానీ భాషపట్ల ఆయనకు ప్రగాఢమైన అభిమానం. విద్యార్థులు తాము నేర్చుకొన్న విషయాలన్నీ తమ మాతృభాషలోకి అనువదించాలనీ, తద్వారా ఆ గ్రామ ప్రజలకు మాతృభాషద్వారా ఆయా విషయాలు బోధించాలనీ గాంధీ సూచించారు. వసతి గృహాలలో ఉండే విద్యార్థులు ఆహార పదార్థాలు ఎంత మాత్రం వృధా చేయకూడదని ఆయన సూచించారు. విద్యార్థులలో జాతీయ భావం పెంపొందాలనీ, వారిలో ఆ విధమైన చైతన్యం కలిగించేందుకు ప్రబోధం జరగాలనీ గాంధీ అభిలాషించారు. విద్యార్థులు రాజకీయాలలో పాల్గొనడం ఆయనకు ఎంతమాత్రము ఇష్టంలేదు. విద్యార్థులు రాజకీయాలలో పాల్గొంటూ విద్యాధ్యయనం కొనసాగించడానికి వీలుపడదని గాంధీ మహాత్ముడు నిర్ద్వంద్వంగా ప్రకటించారు. అధికారంకోసం తాపత్రయపడే ముఠా రాజకీయాలలో విద్యార్థులకు ఏ విధమైన ప్రమేయం ఉండకూడదనీ, వారు ఆ విధమైన వ్యవహారాలలోకి వస్తే వారినిక విద్యార్థులుగా పరిగణించడానికి వీలుండదనీ, వారివల్ల దేశానికి అత్యవసర సమయంలో కలగవలసిన ప్రయోజనం సిద్ధించకుండా పోతుందనీ ఆయన ఒక సందర్భంలో వివరించారు.

కార్మికులలాగా కాక విద్యార్థులు విద్యావంతులుకనుకవారు ఏ సందర్భంములో కూడా సమ్మెచేయరాదనీ. విద్యార్థులు గట్టి క్రమశిక్షణతో మెలగాలనీ, విద్యార్థుల సమ్మెల మూలంగా చాలా దుష్ఫలితాలుతలుగుతాయనీ, అత్యంత అసాధారణ పరిస్థితులలో తప్ప విద్యార్థుల సమ్మె సమర్థనీయం కాదనీ ఆయన నొక్కి వక్కాణించారు. 1940 లో ఒక సందర్భంలో గాంధీ విద్యార్థులు సమ్మెలు మొదలైన ఆందోళనలలో పాల్గొని తమ శక్తి సామర్థ్యాలను వ్యర్థం చేసుకోకూడదనీ, అందువల్ల జాతీయ లక్ష్య సాధనకు కూడా అటంకం కలుగుతుందనీ విద్యార్థుల ఆందోళనలలో గూండాలు, రౌడీలు బహుసులభంగా చేరి పోతారనీ, విద్యార్థులు అహింసా సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలనీ, వారు రౌడీలను అదుపులో పెట్టగలగాలనీ అన్నారు.

విద్యార్థినులు వివాహితులైనా, అవివాహితులైనా బానిసలుగా తయారు కారాదనీ, దేశసేవ చేయడానికి ముందుకు రావాలనీ, వారు ధైర్య సాహసాలు, అలవరచుకోవాలనీ గాంధీ మహాత్ముడు ఉద్బోధించారు.

బాపూ వాణి

విద్యార్థులకు....

విద్యార్థులు పార్టీ రాజకీయాల్లో ప్రవేశించడం,
రాజకీయ ప్రదర్శనల్లో పాల్గొనడం
శుద్ధ తప్పని నా విశ్వాసం.
రాజకీయ ఆవేశాలవల్ల చదువులు పాడవుతాయి.
భావి భారత పౌరులుగా గట్టి కృషి చేయడానికి
ఇది విద్యార్థులకు
పెద్ద ప్రతిబంధకం.
మీరు నేర్చిన విద్య అంతా వృధా
చదువుకునే సమయంలోనే
చక్కని శీలం సమకూర్చుకోలేకపోతే......
మీ ఆలోచనలు, మీరుచేసే పనులు
మీవిగా వుండకపోతే......
ఆత్మ నిగ్రహం అలవరుచుకుని
ఆవేశాలను అదుపులో పెట్టుకుంటే
నిరాశా నిస్పృహలకు తావే వుండదు.

సీరియల్

గృహిణి

పిలకా గణపతి శాస్త్రి

జరిగిన కథ

పార్థసారథి రాఘవ నాట్య కళామండలి ద్వారా నాటకాలు వేస్తుండేవాడు. ఒకసారి ఆయన ఏలూరులో శ్రీకృష్ణతులాభారం నాటకం వేశాడు. ఆ నాటకంలో పాల్గొనవలసిన సరోజ రాకపోవడము వల్ల నాటకం వాయిదాపడింది. తిరిగి స్వగ్రామం వచ్చిన పార్థసారథికి సరోజ మద్రాసు వెళ్ళినట్లు తెలిసింది. పార్థసారధి కూడా మద్రాసు వెళ్ళి సరోజ బసచేసిన హోటలులో ఆమెను కలుసు కున్నాడు. సోమనాథం అనే సినిమా ప్రొడ్యూసర్‌తో సరోజ, ఆమె మేనమామ పేకాట ఆడుతుండగా పార్థసారధి వెళ్ళాడు. సరోజను ఏలూరు నాటకానికి పంపడానికి వీలు కాదనడంతో ఆతనికీ వెంకటకృష్ణయ్యకూ మధ్యరాద్ధాంతం జరిగింది. పార్థసారథి ప్రవర్తనకు సరోజ కూడా కోపగించుకుంది. రూముకు చేరుకున్న పార్థసారథికి జ్వరం వచ్చింది. సరోజ కృతఘ్నత బోధపడింది ఇక ఆమెసంగతి తలపెట్టకూడదని ప్రతిజ్ఞ స్వీకరించాడు కాని మనస్సు ఇంకా కుదుట పడ దు.

మెలకువ వచ్చిన తరవాత వాచీకేసి చూసుకున్నాడు. అప్పుడే ఇంచుమించుగా అయిదున్నర కావచ్చింది! ఆకాశం అంతా ఒంటరిగా ఒకచోట కూర్చుని తీరని దిగులుతో కుమిలి కుమిలి దుఃఖిస్తున్నట్టు చిన్న చిన్న చినుకులతో ఎడతెగని వాన కురుస్తున్నది! పార్థసారథి పరధ్యానంగా ఆ వర్షంకేసి చూస్తున్నాడు. అంతలోనే రాఘవ నెమ్మదిగా తలుపు తెరుచుకుని లోపలికి వచ్చి ఠీవిగా కుర్చీలో కూర్చున్నాడు. "ఎల్లా ఉందయ్యా, నీ జ్వరం? కాస్త నింపాదిగా ఉన్నటేనా?"

ఔనన్నట్టు తల ఊగించాడు పార్థసారథి! అంతేగాని తన యధార్థం, పరిస్థితి వెల్లడించలేదు! మరుక్షణంలోనే రాఘవ అందుకున్నాడు.

"వెంటనే వెళ్ళి గుప్తకి, కృష్ణమూర్తికి అర్జంటు టెలిగ్రాములిచ్చాను! అవి ఈ పాటికి వాళ్ళ కందే ఉంటాయి" ఆ కంట్రాక్టరు పేర వేరే ఒక పెద్ద ఉత్తరంకూడా రాశాను తెలిసిందా? దేవుడు మేలుచేస్తే రేపీపాటికి ప్రయాణం సన్నాహంలో ఉంటావన్నమాట! ఇంటికి వెళ్ళగానే కాస్త క్షేమంగా జేరుకున్నట్టు ఒక ఉత్తరం ముక్క రాయించడం మరిచిపోకేం?'

'అలాగేలే! తప్పకుండా రాయిస్తాను. ఎందుకు మరిచిపోతాను!... అయితే నా కిలాగ జ్వరం వచ్చినట్టు వాళ్ళతో చెప్పావా?'

పార్థసారథి యాథాలాభంగా అన్నట్టు అడిగాడు. అది విని రాఘవ రవంత ఆశ్చర్యపడ్డాడు.

'నిన్న అంతా వాళ్లు ఇల్లు ఒకటి చూసుకోవాలన్న తొందరతో తిరుగుతున్నారు. రంగనాయకిని సరస్వతిని కూడా మద్రాసు తీసుకురావాలని అనుకుంటున్నారు. అందుచేత నీ సంగతి రాత్రి గాని వాళ్ళతో చెప్పడానికి వీలుపడలేదు!'

రాఘవ రెండు మూడు క్షణాలపాటు మౌనంగా ఉండి సిగరెట్టు ముట్టించాడు.

'నా జ్వరం సంగతి విని వాళ్లేమి అనలేదా?' పార్థసారథి ఇనుమడిస్తున్న జిజ్ఞాసతో తిరిగి ప్రశ్నించాడు.

'అనడానికేమి ఉంది!' వెంకట కృష్ణయ్య తనకేమి పట్టనట్లు మాట్లాడక కూర్చున్నాడు. 'సరోజ' అయ్యో! పాపం అలాగా! కొంచెం నింపాదిగా ఉందా?' అని అడిగింది. 'ఏం నింపాది? జ్వరం అలాగేఉంది!, అని సమాధానం చెప్పాను. ఆపైన మరి నీ సంగతే ఎత్తుకోలేదు ఏదీ విననట్టు మాట్లాడక కూర్చుంది!,

రాఘవ అతని ధోరణి పసికట్టి మరింతగా ఆశ్చర్యపడ్డాడు. అంతలోనే పార్థసారథి పంచ ప్రాణాలు ఒక్కసారిగా ఎగిరిపోయినట్టు ఉసూరుమని ఒక నిట్టూర్పు విడిచిపెట్టాడు.

ఇలాగ జ్వరం కాస్తూందని తెలిసిన తరువాత పోనీ ఒక్కసారి చుట్టచూపుగాసయినా చూడ్డానికి రాకపోతూంతా? అనుకున్నాను. అంతే!,

రాఘవ పేలవంగా వేటకారంగా ఒక చిరునవ్వు చిందించాడు.

'అబ్బాయి! నే నొక్కమాట చెబుతాను గాని అనుకోకేం? ఏదో నాటకాలో లాగ సరోజ'నీమీద భరించలేనంత ప్రేమతో విరహవేదనతో వేగిపోతూందని భ్రమ పడావు కాబోలు! ఏమిటో నీవెర్రి ప్రేమేమిటి? ప్రేమ! ప్రేమలేదు! గీమలేదు! ఇవ్వన్ని చేతా వాతా గాని దద్దమ్మలు, పని పాటలేక పుస్తకాల్లో రాసే పిచ్చి మాటలు! అలాంటి అమ్మమ్మలని చూస్తే నాకు అరికాలిమంట నెత్తికెక్కుతుంది కాస నా మాటవిని ఇప్పటికయినా భూమిమీద నడవడం అలవాటు చేసుకో!'

సరోజమీద వంకపెట్టి చల్ల చల్లగా చీవాట్లు వెడుతూ రాఘవ మళ్ళీ సానుభూతి ఒలకబొయ్యడం మొదలుపెట్టాడని పార్థసారధి క్షణంలో పసికట్టివేశాడు. అంతలోనే అలాంటి వ్యవహారాల్లలో అతని విరిక్తిహేళన దృష్టికెంతయినా అసూయ

పడ్డాడు. తనకి కూడా అటువంటి వైఖరి అలవాటుపడి ఉంటే ఎంత బాగుండును! అనుకుని తిరిగి సుదీర్ఘంగా నిశ్వసించాడు. వెంటనే రవంత చిరాకుతో ఆ ప్రస్తావన మార్చివేశాడు. 'సరే! దీనికేంలే గాని ఇంతకి వాళ్ళకి అన్ని హంగులు ఉన్న ఇల్లేమయినా దొరికిందా?'

'ఆఁ! ఈ మహా పట్టణంలో అలాంటి ఇల్లు దొరకడం అంటే మాటలేమిటి? ఇంకొక నెల రోజులదాకానయినా ఆ హోటల్లో పడి ఉండకతప్పదని బాధపడుతున్నారు!'

'మరి నీమాట?'

'నాకింకా కొంతకాలందాకా' సత్రం భోజనం మఠం నిద్ర తప్పదనుకుంటాను! ఇక్కడ కొంచెం కాలు నిలవదొక్కుకుంటే ఆ పైన ఇల్లు సంగతి ఆలోచిస్తాను!... నిన్ను పనిలో చేర్పించే మాట మరిచిపోనులే! ఏమిటో! పాపం నీ పరిస్థితి తలుచుకుంటే నాకు గుండెలో చెయ్యిపెట్టి కదిలించివేసినట్టుంది!'

ఆ కడపటి వాక్యాలు వినీ వినగానే పార్థసారథి నెమ్మదిగా మూలుగుతూ ఇంకొకవైపు తిరిగాడు. మరికొన్ని క్షణాలలోనే రాఘవ రిస్టువాచీ చూసుకుని లేచి నిలుచున్నాడు.

'మరి నేను వెడతానయ్యా కాస్త ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో! వస్తే మూడు వంతులు మెయిలు దగ్గిరికి వస్తాను. ఒకవేళ రాలేకపోతే ఏమీ అనుకోకు! ఉత్తరం రాయించడం మాత్రం మరిచిపోకేఁ!'

రాఘవ చర చరా నడుస్తూ వీధిలోకి వెళ్ళిపోయాడు! పార్థసారథి కప్పటికి జ్వరం మరింతగా ముమ్మరంగా కాస్తున్నట్టు తోచింది. విపరీతమయిన నిస్పృహవల్ల మథనవల్ల శారీరకంగానే కాక మానసికంగా కూడా బడలిన అతనికి మరి కొంత సేపటికి కొంచెం మగత నిద్ర పట్టింది! అంతలోనే సరోజ తలవని తలంపుగా తొందరగా తలుపు తోసుకుని అక్కడికి వచ్చింది! అతని పక్కనే పరుపుమీద కూర్చుని ఒంటిమీద చెయ్యివేసి ఎంతో ఆప్యాయంగా ఎలాగున్నదని అడిగింది! కళ్లు తెరిచి నాలుగువైపుల పరకాయించి చూశాడు! ఎక్కడ ఆమె కనబడలేదు! అదంతా వట్టి పగటికల! ఎదురుగా గోడమీద జాగ్రత్తగా పొంచి ఉన్న బల్లి అమాంతంగా ఒక పురుగుమీది కురికి తటాలున నోట పెట్టుకున్నది! ఆవేళరాత్రి పార్థసారథికి కాఫీకూడా పుచ్చుకోవాలని అనిపించలేదు! వాన క్రమ క్రమంగా ఎక్కువై దాని సవ్వడి మంద్ర మంద్రంగా వినిపించింది. ఆ ధ్వని వింటూంటే మరికొంత సేపటికి తిరిగి అతనికి కొంచెం నిద్రపట్టింది.

కృష్ణమూర్తి పేర టెలిగ్రాం వచ్చిందని విని విజయలక్ష్మి ఎంతయినా భయపడింది. అంతగా ఆందోళన పడవలసిన అవసరమేమి లేదని రాఘవ ఆ టెలిగ్రాం చివరి వాక్యంలో స్పష్టంగా హెచ్చరించాడు. అదేమాట చెప్పి కృష్ణమూర్తి ఆమెనోదార్చాడు. అయినా విజయలక్ష్మి కెందుచేతనో ఊరట కలగలేదు. ఒకవేళ తానేమయినా కంగారు పడిపోగలనని రాఘవ అలాగ రాశాడేమో! కృష్ణమూర్తి దగ్గరనుంచి టెలిగ్రాం కాగితం తీసుకొని స్వయంగా నెమ్మదిగా చదువుకుంది. "కంగారేమి లేదు" అని అర్థంవచ్చే ఇంగ్లీషు మాటలు రెండు దానిమీద స్పష్టంగా కనిపించాయి. ఆమె అంతకుమునుపే భర్త రాకకోసం ఎంతయినా ఆరాటపడుతున్నది! దానికి బదులుగా ఆ టెలిగ్రాం వచ్చింది. దానిలో పార్థసారథికి జ్వరంగా ఉన్నదని మాత్రమే రాశాడు. అంతే! ఇంతకి అనుకున్న నాటికి నాటకం జరిగిందా లేదా? జరగలేదన్నమాటే! బహుశః అందువల్లనే మద్రాసునుంచి ఆ విధంగా టెలిగ్రాం వచ్చిఉంటుంది! భర్త. సరోజకోసం మద్రాసువెళ్ళి అక్కడ అకస్మాత్తుగా జబ్బు పడి ఉండవచ్చును. అసలు ఇంటి దగ్గరనుంచి బయలుదేరివెళ్ళే టప్పుడే కొంచెం పులకరంగా వుంది. అక్కడికి వెళ్ళాక అది బాగా ఎక్కువయిఉంటుంది.

అప్పటికప్పుడే మధ్యాహ్నం మూడుగంటలయింది మద్రాసు వెళ్ళే మెయిలు సాయంత్రం ఏడున్నరకే స్టేషన్ లో బయలుదేరుతుంది. కాని వెంటనే కృష్ణమూర్తి ప్రయాణానికి కావలసిన సొమ్ముకూడా సమయానికి ఆమెదగ్గర లేకపోయింది! నోరు విడిచి ఆ మాటే అతనితో చెప్పింది.

"నా దగ్గర ఎప్పుడు ఏదో బాపతు సొమ్ము నిలవఉండేది బావా! ఇదేమి అపశకునమో మరి! సమయానికి నీ రాకపోకలకి కావలసినంత డబ్బుకూడా నా దగ్గర లేకపోయింది."

విజయలక్ష్మి ఆ పరిస్థితి కెంతయినా బాధపడింది! ఎప్పుడు అలవాటులేనిది ఇరుగు పొరుగుల ఇళ్ళ కెక్కడికయినా వెళ్ళి చేబదులు అడగాలనికూడా అనుకున్నది కాని అంతలోనే కృష్ణమూర్తి కావలసినంత సొమ్ము తేలికగా సంపాదించగలనని మాట ఇచ్చాడు. వెంటనే వెళ్ళి తన కాత్మీయమిత్రుడయిన హైస్కూలు హిస్టరీ టీచరు నడిగి అనుకున్నదానికంటె కొంచెం ఎక్కువ మొత్తమే చేబదులుగా సంపాదించాడు. వెంటనే బయలుదేరి వెళ్ళిపోవాలని తొందరపడ్డాడు గాని విజయలక్ష్మి బలవంతంమీద భోజనం చెయ్యక తప్పలేదు. ఆదరా బాదరగా నాలుగు మెతుకులు నోట్లో పెట్టుకుని, హోల్డాలుకట్టుకుని అంతకుమునుపే విజయలక్ష్మి పిలిపించిన గుర్రపు బండిలో ఎక్కి కూర్చున్నాడు. "ఎల్లుండి పొద్దున్న మెయిలులోనే ఇద్దరము తిరిగి వస్తున్నా" మని చెప్పి అనవసరంగా కంగారుపడవద్దని హెచ్చరించి అయిదారు నిమిషాల లోనే బండితోబాటు అదృశ్యుడయ్యాడు.

ఆ సమయంలో వర్ధనమ్మ, సావిత్రి విజయలక్ష్మికిరువైపుల నిలుచున్నారు. సావిత్రి ఆమె దైన్యం గమనించి చల్లని మాటలలో ధైర్యం చెప్పింది. ఆ పైన వర్ధనమ్మ మనమరాలిమీద రవంత చిరాకుపడింది.

"అయినదానికి కానిదానికి అలాగ బెంబేలు పడిపోతే ఎలాగే! పట్టణంవెళ్ళాక అతని జ్వరం ఎక్కువయినట్టయింది! అసలే పుట్టెడు పులకరంతో వెళ్ళాడాయెను! ప్రయాణం బడలికవల్ల అక్కడికి వెళ్ళాక అది మరింత ఎక్కువయిందేమో? ఆ రాఘవకి బొత్తిగా తీరికలేక స్వయంగావచ్చి తీసుకువెళ్ళవలసిందని టెలిగ్రాం కొట్టాడేమో! అంతమాత్రానికే ఇంత కంగారెందుకు!"

(సశేషం)

ఆది జల ప్రళయం. వాయువు, వరుణుడు ఏకమై విలయతాండవం చేశారు. జనావళికి కలిగిన నష్టం ఇంతా అంతా కాదు. అది మాటలలో చెప్పలేము. రూపాయలలో లెక్కకట్టలేము." అని ఇటీవల తుఫాను వెలసినవెంటనే బాధిత ప్రాంతాలను చూసివచ్చిన ఒక పత్రికావిలేఖరి హృదయతాపాన్ని వ్యక్తపరిచాడు.

నిజమే. ప్రకృతి శక్తులు విజృంభించినపుడు వాటికి హద్దేమున్నది? మానవుడు చేయగలిగినదేమిటి? మొన్న మొన్ననే మున్నెన్నడూ ఎరుగని విధాన భూమి కంపించి, కలిగించిన కలవరపాటునుండి తేరుకొనకముందే, అదేమున్నది ఇది చూడమన్నట్టు జలప్రళయం. గడచిన నెలదినాలుగా ఆంధ్రప్రజానీకం అనుభవిస్తున్న అరిష్టాలకు ఇది పరాకాష్ఠ.

నాలుగురోజులపాటు మన్నూ, మిన్నూ ఏకమైన కుంభవృష్టికీ, గంటకు వంద కిలోమీటర్ల వేగంతో వీచిన పెనుగాడ్పులకూ అనేక గ్రామాలలో అసంఖ్యాకంగా ఇళ్లు కూలిపోగా రెండు నిలువుల లోతు వరద వచ్చి మరికొన్ని గట్టి భవనాలను సైతం దెబ్బతీసింది.

ప్రజలు అనుభవించిన కష్టాల హృదయ విదారక గాథలు ఎన్నో క్రమంగా తెలియవస్తున్నాయి.

పెట్టెకోసం ప్రాణాలు

బాపట్ల తాలూకాలో యానాదిపాలెం గ్రామం నామరూపాలు లేకుండా కొట్టుకుపోయింది. ఇందలి జనాభాలో మూడు వంతులకు పైగా వరదపాలైనారు.

భార్యా బిడ్డలను అతిప్రయాసమీద రక్షించుకొని, తనకున్న యావదాస్తి అయిన ఒక పెట్టెను తెచ్చుకోవడంకోసం ప్రయత్నించిన ఒక నిరుపేద పెట్టెను తెచ్చుకోలేకపోగా ప్రాణాలనే కోల్పోయాడు. ఆ పాడుపెట్టె నెందుకు రక్షించవలసి వచ్చినదని ఆ యిల్లాలు వాపోయింది.



చెట్లు కూలిన దృశ్యం


యజమానికిచెందిన కొన్ని వేల రూపాయలుసొమ్మును దగ్గర వుంచుకొని తన రక్షణకోసం జాలరులకు ఐదు రూపాయలు యిచ్చే స్వాతంత్ర్యం లేకపోయిన ఒక సామాన్యుడు సాహసంచేసి వరద దాటపోయి డబ్బును, ప్రాణాలనుకూడా పోగొట్టుకొన్నాడు.

ఖమ్మం జిల్లాలో రెండు వందల గొర్రెలు వరదలో కొట్టు కొనిపోగా తనింక బ్రతకడ మెందుకని నిరాశచెందిన గొర్లకాపరి తానుకూడా వరదపాలైనాడు.

మిద్దెమీద ఎద్దులు

ఖమ్మం జిల్లాలోని ఒక గ్రామంలో రెండున్నర నిలువల లోతు వరద రాగా 15 ఎద్దులు ఈదుకుంటూ ఒక మిద్దెమీదికి చేరు కున్నాయి. తెల్లవార్లూ అవి అలా మిద్దెమీదనేగడిపాయి. అందులో నాలుగు ఎద్దులుమట్టుకు ఒకదానినొకటి తోసుకొని మళ్ళీ వరదలో పడి కొట్టుకుపోయాయి. మిగతా వాటిని వరద తగ్గిన తర్వాత మోకులూ, పగ్గాలూ వేసి అతి కష్టంమీద క్రిందికి తీసుకువచ్చారు.

మల్లవరం అనే గ్రామంలో ఒక ఉపాధ్యాయుడు వరద ఉధృతాన్ని గమనించి తన పెంకుటిల్లో కుటుంబంతోసహా ఒక దూలంమీదికి ఎక్కి కూర్చున్నాడు. దూలం వరకు వరద పెరగ డంతో ఇంటి కప్పుకు కన్నంవేసి, పైకెక్కి తన కుటుంబాన్ని, తనను రక్షించుకొన్నాడు.



ఆంధ్రప్రదేశ్‌లో తుఫాను నష్టం

ఆంధ్రప్రదేశ్‌లో మే 16 నుండి సంభవించిన తుఫానువల్ల పంటలకూ, పశువులకూ అపార నష్టం కలిగింది. అనేక మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు.

మొత్తం నష్టం రు. 100 కోట్లకు మించి వుంటుందని అంచనా. సుమారు వెయ్యిమంది మరణించారు. 4 లక్షల ఎకరాల్లో వరి పంట నాశనమైంది. రెండు వేల గ్రామాలకు తుఫాను దెబ్బ తగిలింది. ఒక్క గుంటూరు జిల్లాలోనే లక్షన్నర పశువులు చనిపోయాయి. మొత్తం మీద 2 లక్షల గృహాలు పడిపోయాయి.

సీరియల్

తిరస్కృతి

—వాసిరెడ్డి సీతాదేవి

భూమి తనచుట్టూ తాను తిరుగుతూనే ఐదుసార్లు సూర్యునిచుట్టూ తిరిగింది. ఈ ఐదు సంవత్సరాల కాలంలో కొందరి జీవితాల్లో ఎలాంటి మార్పు రాక పోయినా, కొద్ది మంది జీవితాల్లో చెప్పుకో దగిన మార్పులే వచ్చాయి.

కను చీకటి పడుతోంది. అప్పుడే వెలిగిన విద్యుద్దీపాల కాంతిలో హైదరాబాదు నగరం వింతసోయగాన్ని వెదజల్లుతోంది. నగరం నడిబొడ్డున వున్న రవీంద్రభారతికి పక్కగా వున్న కళాభవనంలో చిత్రప్రదర్శన శాలను దర్శించటానికి కొందరు కళాప్రియులు వస్తున్నారు. కొందరు చూసి తిరిగి వెళుతున్నారు.

ఒక నవయువతి, నడికారు దాటిన పెద్దమనిషితో కళాభవనంలో అడుగు పెట్టింది. చూడగానే వాళ్లిద్దరు తండ్రి కూతుళ్లయి వుంటారని తెలుస్తూనేవుంది. ఆ యువతి సన్నగా, పొడవుగా అతి సాధారణంగా వుంది. చెప్పుకోదగిన సౌందర్యవతి కాక పోయినా, ఆమె ఎదురు పడితే ఎవరబ్బ ఆయువతి! అని ఓక్షణం చూపరులను నిలబెట్ట గలిగే ప్రతేక్యత ఏదో వుం . ఆమె వ్యక్తిత్వంలో, ఆమె చిన్న చిన్న కళ్లు ఎంతో చురుగ్గా, ఎప్పుడూ ఏదో లోతుగా ఆలోచిస్తున్నట్లుంటాయి. ఆ ప్రత్యేకత వల్లనే ఆమె మొహంలో వయస్సుకు మించిన గాంభీర్యం కనిపిస్తూ వుంటుంది. ఆమె ప్రక్కన వున్న పెద్దమనిషి ఎవరోకాదు కేశవరావు. కలగాపులగంగా తల నెరసి, ఆయన వయస్సుకు నిండుతనాన్ని చేకూరుస్తుంది.

కేశవరావు ఓ చిత్రంముందు నిలబడి దీక్షగా చూస్తున్నాడు. ప్రక్క చిత్రాన్ని చూసి విమల వచ్చి తండ్రి ప్రక్కగా నిల్చుంది. తండ్రి అంత తన్మయత్వంతో చూస్తున్న చిత్రాన్ని కుతూహలంతో చూడ సాగింది.

మండువా లోగిలి తాలుకు వసారా. ముందు విశాలమైన ముంగిలి. ప్రహరీ గోడకు కుడిప్రక్కగా చివర్లో ఓ వేపచెట్టూ, దాని ప్రక్కనే మొదట్లో వంకర బోయి వంగినట్లుండే చిటికేశ్వరపు చెట్టు. ఆ చెట్టు మొదట్లో కట్టివేసివున్న పుల్లావు. ఆవుకు అల్లంత దూరంలో చిన్న కట్టుకొయ్యకు కట్టేసి వున్న తెల్లటి ఆవు దూడ ఆవుకు జనప కట్టెను వేస్తున్న జీతగాడు బుడ్డాడు. ఇంటి వసారాలో, అప్పుడప్పుడే యవ్వనపు ప్రాంగణంలో అడుగు పెడుతున్న ఒక పడుచు పిల్లకూర్చొని అలంకరిం కొంటుంది. ప్రాతఃకాలపు ఆతపంలా వెచ్చగా వున్న యవ్వనం ఆమె శరీరపు ప్రతి వంపులోనుంచి తొంగి చూస్తోంది. కుడికాలును మాత్రం చాపి వయ్యారంగా కూర్చొని వుంది. చాచిన కాలు బొటన వ్రేలూ. ఆ ప్రక్క వ్రేలుకూ మధ్య నాలుగు పలకల చెక్క ఫ్రేములో బిగించి వున్న చిన్న అద్దంవుంది. తలవంచి అద్దంలోనికి చూస్తూ కుడి చేతి చూపుడు వేలితో బొట్టు పెట్టుకుంటూంది. బిరుగ్గా వేసిన పొడవాటి జడ, భుజంమీదగా ముందుకు గుండెల మీదనుంచి నల్లత్రాచులా నిగ నిగ లాడుతూ వేలాడుతుంది. ముచ్చెనగుంటకు కొంచెం పైగా నాగారం, పాపిడికి కుడిపక్కగా చంద్రవంకా చంపాసవరాలు, మొదలైన నగలతో ఆ పడచు పిల్ల, పల్లెల్లో వుండే ఆడపిల్లల ప్రతినిధిగా కనిపిస్తోంది ప్రతి వాళ్లూ ఆ చిత్రం దగ్గర కొచ్చి నిలబడి ప్రశంసిస్తున్నారు.

"మోడ్రన్ ఆర్టు చూసి, ఇది చూడగానే ప్రాణం లేచి వచ్చింది. దిక్కుమాలిన మాడ్రన్ ఆర్టు అర్థం అయిచస్తుందా. ఏమన్నానా! అన్నాడు కేశవరావు విమలతో.

జరిగిన కథ

సత్యం సూర్యం అన్నదమ్ములు, పెద్దవాడు సత్యం శాంతినికేతనం వెళ్ళి చిత్రలేఖనం నేర్చుకొచ్చాడు, చిన్నవాడు సూర్యం పట్నంలో వైద్యం చదువుతున్నాడు. మేనమామ కూతురు సరళ చిన్నప్పటినుంచీ వాళ్ళింట్లోనే వుంటున్నది పెద్దబావఅంటే సరళకు యిష్టం అయితే పెద్ద బావ చిన్నబావలాగ ఎప్పుడు న అందాన్ని గు రించి పొగడడని సరళకు కోపం. తమ ఇంట్లో తలు ఉతికే మా ణిక్యం పాటైనా తను చెయ్యకపోయినందుకు మెకు బాధ కలిగింది. "సరళకు నీవేతగిన భర్తవు" అని తమ్ముడి పేరసత్యం చీటిరాసి ఇంట్లోనుంచి వెళ్ళిపోతాడు.

"అలా అనకండి ! ఇది బాగుందనండి కాని మోడ్రన్ ఆర్టుబాగా లేదంటేమాత్రం ఒప్పుకోను, అన్నాడు పక్కనే నిల్చొని అదే చిత్రాని చూస్తూన్న ఓ యువకుడు.

"నేను మోడ్రన్ ఆర్టును తిట్టడం లేదండి, అర్థం కాదంటూన్నాను. అంతే!"

"మోడ్రన్ ఆర్టును అర్థంచేసుకోవటానికి మన మానసిక స్థాయి పెరగాలి. కనీసం అలాంటి ఆర్టును చూసి ఆనందించడం అలవాటు చేసుకోవాలి." అన్నాడు ఆ యువకుడు ఉద్రేకంగా.

"కళ అనేది అందరికోసం అయివుండాలి. పైగా ఆనందం అలవాటు వల్ల సంపాదించుకునేది కాదు. పైగా మనకు అర్థకాని

వస్తువులో ఆనందం లభించదు. ఈ చిత్రం చూడండి దీనికి ముందున్న ఆ నాలుగు చిత్రాలను చూడండి!" అన్నాడు కేశవరావు.

"ఆ ముందుగా వున్న నాలుగు చిత్రాలను చిత్రించిన కళాకారుడే దీన్నీ చిత్రించాడు. ఈ చిత్రాన్ని మీరు అర్థం చేసుకొన్నట్లు! దీనితో తాదాత్మ్యం చెందినట్లు వాటిని చూసి పొందలేక పోయారు. కారణం ! ఈ చిత్రంలో మీకు వాస్తవ జీవితంలో పరిచితమైన రూపాలే కన్పిస్తున్నాయి దీని వల్ల జనిం చేది శుద్ధ కళాత్మకమైన ఆనందం అనటానికివీల్లేదు. ఉదాహరణకు సంగీతాన్ని తీసుకోండి. రాగాలాపనను మనం ఆనందించడం లేదు. అందులో ఎలాంటి భావము మనకు స్ఫురించదు. అదే ఒక పాట పాడినప్పుడు ఆరాగం కంటే, మన మనస్సు ఆ పాటయొక్క భావం మీద లగ్నమై వుంటుంది. కనుక దాన్ని శుద్ధ కళానుభూతి అనటానికి వీలు లేదు. కాని ఒట్టి రాగాలాపనను ఆనందించటానికి కొంత సంగీత జ్ఞానం అవసరం, అభిరుచి కూడా అవసరం అలాగే ఈ మోడ్రన్ ఆర్టు కూడా. ఇదొక ప్రయోగం." అన్నాడు ఆ యువకుడు ఉద్రేకంగా.

కేశవరావు మాట కోసం వెతుక్కోసాగాడు విమలకు వళ్ళు మండిపోయింది. అందుకుంది.

"ప్రయోగం కోసం ప్రయోగాలు చెయ్యటంఅనే సిద్ధాంతం నాకు అర్థంకాదు ఆత్మ ప్రేరణ లేని ప్రయోగం నిరర్థకమైనది ఆత్మ ప్రేరణ వల్ల జన్మించే కళలో కాంషస్‌నెస్ ప్రశ్నేకాదు ప్రయోగం కోసం ప్రయోగం చేసే కళాకారూ, కొత్త కొత్త డిజైనుల్లో బిల్డింగ్స్ కట్టటానికీ భేదం లేదు రంగుల మిశ్రమంతో, అస్పష్టరేఖల్లో అనుకోకుండానే ఏదో కొత్త ప్రయోగం రూపొంద వచ్చు పసి పిల్లవాడు పొరపాటున వంపే సిరా, తెల్లకాగితం మీద ఒక సారి తమాషాగా ఆర్టిస్టిక్‌గా ఆకర్షణీయంగా, ఏదో చిత్రమైన రూపాన్ని ధరించ వచ్చును అంత మాత్రం చేత దాన్ని ప్రయోగం అనీ. ఆ పసివాణ్ణి ఓ పెద్ద కళాకారుడనీ, చెప్పుకొని గర్వించగలమా ! నాకు ఈ కళల గురించి తెలిసింది తక్కువే. అయినా ఒక సాధారణవ్యక్తిగా నాకు కలిగిన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నాను క్షమించండి. మనం మన ఆత్మ సంబంధమైన సత్యాన్ని కళరూపంలో అభివ్యక్తం చెయ్యటానికి ప్రయత్నించాలి. అంతేకాని బుద్ధిని ఉపయోగించి రంగులతో చేసే ఆకర్షణీయమైన చమత్కారం కళ అనిపించుకోదు. కళాకారుని ఆత్మ ప్రతిబింబించని కళ ఏదీ కళ కాదు. వాస్తవమైన కళ, జీవిత యథార్థంతో ఉండే ఆత్మ సంబంధాన్ని వ్యక్తీకరిస్తుంది. "ఆవేశంగా చెప్పుకు పోతున్న విమల అకస్మాత్తుగా ఎవరో గొంతునొక్కేసినట్లు ఆగి పోయింది.

ఆ యువకుడు విమలను కళ్లు చిట్లించి అదోలా లోతుగా చూస్తున్నాడు. విమలకు కొంచెం ఇరుగ్గా అనిపించింది.

"ఆగిపోయారేం ?" అన్నట్లు కొంటెగా ఓసారి చూసి అన్నాడు ఆ యువకుడు విమలతో, "వాస్తవాన్ని అనుకరించటమే కళ అని నేను నమ్మను. యథార్థాన్ని యథాతథంగా చిత్రించటంలో కళాకారుని ఆత్మ ఎలా ప్రతిబింబిస్తుంది ! న్యాయంగా కళాకారుని ఆత్మ ఒకరకంగా, యథార్థాన్ని అనుకరించటంలో కాదు. 'యాబ్‌స్ట్రాక్ట్' రూపాల్లోనే అభివ్యక్తం అవుతుంది. కళాకారుని అనుభూతి 'యాబ్‌స్ట్రాక్ట్' రూపంలోనే వుంటుంది. ఆ అనుభూతిని అభివ్యక్తం చేసే ప్రయత్నంలోనే కళాకారుడు ప్రయోగం చేస్తాడు."

"అలా అయితే కళాకారుని అనుభూతిని, కళాకారుడు తనలో తనే కళ్లుమూసుకొని 'యాబ్‌స్ట్రాక్ట్' రూపంలో అనుభవిస్తే సరిపోతుందిగా. ఒక విధంగా శుద్ధమైన 'యాబ్‌స్ట్రాక్ట్' అనుభూతిని యథాతథంగా ఏ రూపంలో కూడా అభివ్యక్తపరచ లేమేమో!" ఉద్రేకంగా అంది విమల.

"అమ్మాయ్! చూడు ఆ చిత్రకారుని పేరు ఏమిటో!" అన్నాడు కళ్లు ఆ చిత్రం మీద నుంచి మరల్చకుండానే కేశవరావు కుతూహలంగా. విమల కళ్లు చిత్రకారుని పేరుకోసం వెతికాయి. "సత్యం"అన్న రెండక్షరాల పేరును పదేపదే మననం చేసుకుంటూ ఆలోచనలోకి జారిపోయింది.

"అతని పేరు సత్యం: దీనికి ముందుగా మీరు చూసిన మోడ్రన్ ఆర్ట్‌కు సంబంధించిన ఆ నాలుగు చిత్రాలుకూడా అతనివే." అన్నాడు అంత సేపూ వాదించిన యువకుడు.

విమల కళ్లు ఏదోభావంతో తళుక్కుమన్నాయి. "నాన్నా! ఇతను మన సత్యమే అయివుంటాలి. అవును! ఆ ఇల్లు చూడు వాళ్ల ఇల్లులాగే వుంది. ఆ అమ్మాయిని చూశావు కదూ? ఎక్కడో చూసినట్లుందే అనుకున్నాను. సరళ పోలికలు." ఉత్సాహంగా అంది విమల.

"నాకూ అలాగే అనిపిస్తుంది!" అన్నాడు కేశవరావు సాలోచనగా.

"సత్యం మీకు తెలుసా?" ప్రశ్నించాడు ఆశ్చర్యంగా ఆ యువకుడు.

పానకంలో పుడకలా మధ్య నువ్వేమిటి అన్నట్లు చూసింది విసుగ్గా అతని ముఖంలోకి విమల. కాని అతని చొచ్చుకొని పోయే చూపుల నుంచి తనను తప్పించుకొనే ప్రయత్నంలో తండ్రి వైపు చూసింది.

"నాన్నా! సత్యం ఈ ఊళ్లోనే వున్నాడేమో! సందేహం లేదు! అతను మన సత్యమే! ఎవర్నయినా కనుక్కో నాన్నా!" అంది ఆత్రంగా విమల.

"ఈ చిత్రకారుడు సత్యం, మా సత్యం ఒక్కడేనో కాదో నాకు తెలియదు. కాని ఇతను అంటే మా సత్యం ఈ ఊళ్లోనే వున్నాడు" ఆ యువకుడు వస్తున్న నవ్వును ఆపుకుంటూ అన్నాడు. అతనికి విమలను ఉడికించాలని వుంది ఆమె నిర్లక్ష్యంగా వున్న కొద్దీ !

(సశేషం)

ఆంధ్రప్రదేశ్ ఇటీవల అనేక గడుసమస్యలను ఎదుర్కోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు ప్రత్యేక తెలంగాణా కావాలనే ఆందోళన సాగుతుండగా గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి, ఖమ్మం జిల్లాలు తుఫాను తాకిడికి గురైనాయి.

తెలంగాణా ఆందోళనకు ప్రధానకారణం ఉద్యోగాలు. ఉద్యోగులు, విద్యార్థులు యీ ఉద్యమాన్ని ప్రథమంగా ప్రారంభించారు. ముల్కీలు కాని వారికి కొన్ని ఉద్యోగాలు యివ్వడంవల్ల అలజడి కలిగింది. దీనిని సరిదిద్దడానికి, తెలంగాణా ప్రాంతీయులకు న్యాయం జరగడానికి కొత్తగా 2 వేల ఉద్యోగాలను ఏర్పాటు చేయడానికి రాష్ట్రప్రభుత్వం సత్వరచర్యలు తీసికొన్నది.

వివిధరకాల ఉద్యోగాల రిక్రూట్‌మెంటుకు దరఖాస్తు చేయడానికి వీలుగా గరిష్ఠ వయః పరిమితిని 28 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం ప్రకటించింది.

జిల్లాలలోని ఎల్, డి. సి. లు టైపిస్టులు, స్టెనోటైపిస్టులు, లైబ్రేరియన్లు, అసిస్టెంటు లైబ్రేరియన్లు, క్యాష్‌కీపర్ వంటి పదవులకు నియామకపు అధికారాలను సర్వీసుకమిషన్ నుంచి తొలగించి జిల్లాకలెక్టర్లకు దత్తం చేయడం జరిగింది.

ప్రాంతీయ, జిల్లా, సబార్డినేట్ కార్యాలయాలకు చెందిన నియామకం అధికారులు ప్రతిరకంలోను ఎన్నిఖాళీలున్నాయో కలెక్టర్లకు తెలియపరచాలి. నిర్ణీత దరఖాస్తు ఫారాలపై అభ్యర్థుల దరఖాస్తులు పంపడానికి ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజిలుఏర్పాట్లు చేస్తున్నవి. ఉపాధ్యాయులను ఆయాజిల్లా పరిషత్ అధ్యక్షులు రిక్రూట్‌చేస్తారు. సూపర్వైజర్ల వంటి సాంకేతిక పదవులకు సంబంధించిన నియామకాలను చీఫ్‌ఇంజనీర్ చేస్తారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసిన ఉద్యోగాలలో ఉపాధ్యాయులు 1036, జూనియర్ ఇంజనీర్లు సూపర్వైజర్లు 132, గుమాస్తాలు 676, జిల్లా ఇన్స్పెక్టర్లు 25, టైపిస్టులు 139 పదవులు వున్నాయి.

ఉద్యోగాల విషయంలో, వెంటనే తెలంగాణా వారికి కొన్ని సౌకర్యాలు కలిగించడానికి ప్రభుత్వం యీ చర్యలు తీసికొన్నది.

వ్యవసాయ రంగంలో కూడా ఆంధ్రప్రాంతంలో కన్నా తెలంగాణాలోనే ఎక్కువఖర్చు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రణాళిక. పంచాయతీరాజ్ శాఖ ప్రచురణలో వెల్లడించారు.

పరిస్థితిని గుర్తించకుండా కొందరు నాయకులు తెలంగాణా రాష్ట్రంకోసం ఆందోళన అల్లర్లు లేవదీస్తున్నారు. ఈ ఆందోళన అల్లర్లవల్ల ఉత్పత్తితగ్గడం, ప్రజల, ప్రభుత్వ ఆస్తులకు నష్టం రావడమేకాక, ఉద్యోగావకాశాలుకూడా సన్నగిల్లాయి. ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి హరిజన విద్యార్థుల సదస్సును మే నెల 12 వ తేదీన ప్రారంభిస్తూ ఒక విషయం వెల్లడించారు.

ఇద్దరు పారిశ్రామిక వేత్తలు ఒకట్రాక్టర్ ఉత్పత్తి ప్రాజెక్టును, మరొక ప్రాజెక్టును నెలకొల్పడానికి నిర్ణయించుకొన్నప్పుడు, వాటిలో మనకు నాలుగువేలకు పైగాఉద్యోగాలు లభిస్తాయని ఆశించామనీ, కాని యీ ఆందోళన మూలంగా వారు వెనుకంజ వేశారనీ ముఖ్యమంత్రి తెలిపారు. కొద్దినెలల క్రితం తాను కలకత్తా వెళ్ళినప్పుడు, అక్కడి పారిశ్రామిక వేత్తలు హైదరాబాదులో రు. 50 కోట్ల పెట్టుబడితో ప్రాజెక్టులు, కర్మాగారాలు ఏర్పాటు చేయడానికి సంసిద్ధత కనబరచారనీ, కానివారే ఇప్పుడు సంకోచిస్తున్నారనీ ఆయన అన్నారు.

ఆర్. టి: సి. కి రాబడి నష్టం

తెలంగాణాలో నాలుగైదునెలలుగా, సాగుతున్న ఆందోళన ఫలితంగా రోడ్డురవాణా సంస్థకు బస్సులవిధ్వంసంవల్ల ఇంతవరకు (అనగా మే నెల మధ్యవరకు) 20 లక్షల రూపాయల నష్టం వచ్చినట్లు అధికార్లు తెలిపారు. దీనికితోడు బస్సు ప్రయాణీకులవల్ల వచ్చే ఆదాయంలో రోజుకు సగటు 6 లక్షలరూపాయల ఆదాయం పడిపోయింది. జిల్లాలనుంచి వచ్చేవారు సగటున రెండులక్షల మందిచొప్పున తగ్గిపోయారు.

ఐక్యతా ప్రదర్శన

మే నెల 17 వ తేదీన పది వేల మంది నగరంలో గొప్ప ప్రదర్శన జరిపారు గాంధీ భవనంనుంచి ఈ ఊరేగింపు బయలుదేరి పటేల్ విగ్రహం వరకు వెళ్ళి సభ జరిపారు. రాష్ట్ర సమైక్యతను బలపరుస్తూ, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని ప్రభుత్వ దృష్టికి తెచ్చేందుకై ఆంధ్రప్రదేశ్ సమైక్య సం ం యాజమాన్యాన యీ సభ జరిగింది.

ఇదే విధంగా విద్యార్థులుకూడా రాష్ట్ర సమైక్యత కోసం, కళాశాలలు తెరిచి పరీక్షలు జరిపించడంకోసం ఆందోళన సాగిస్తున్నారు. మే 28 వ తేదీన నగరంలో విద్యార్థులు పెద్ద ఊరేగింపు జరిపి, వెంటనే కళాశాలలు, పాఠశాలలు తెరవాలనీ, పరీక్షలు జరుపాలనీ కోరారు. ఈ ఉద్యమం ఒక దశ చేరిన తర్వాత విద్యార్థులు తప్పుకోవాలనే అభిప్రాయం చాలా మందిలో ఏర్పడిన సూచనలు కనిపిస్తున్నాయి.

నాగర్ కర్నూలు సభ

మే నెల 25 వ తేదీన మహబూబ్ నగర్ జిల్లా నాగర్ కర్నూలులో బ్రహ్మాండమైన సభ జరిగింది. ఈసభలో ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి, రెవిన్యూ మంత్రి శ్రీ వి. బి. రాజు, కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ జె. వి. నరసింగరావు, సహకార మంత్రి

శ్రీ విజయభాస్కర రెడ్డి, పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి టి. లక్ష్మీకాంతమ్మ ప్రసంగించారు.

ఎంత త్యాగం చేసి అయినా ఆంధ్రప్రదేశ్ సమైక్యతను పరిరక్షించాలని 20 వేల మంది హాజరయిన సభ తీర్మానించింది.

ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ దౌర్జన్యాలవల్లకానీ, ఒత్తిడుల వల్లకానీ, గోడలపై అసభ్య వ్రాతలవల్లకానీ ప్రత్యేక తెలంగాణా ఏర్పడబోదని అన్నారు. ప్రభుత్వంలో నిన్న మొన్నటివరకు వున్నవారే నేడు ప్రభుత్వంలోవున్న లోటుపాట్లను గురించి మాట్లాడుతున్నారన్నారు.

గత 12 ఏండ్లలో తెలంగాణా సాధించిన అభివృద్ధిని వివరిస్తూ, ఆంధ్రప్రదేశ్ ఏర్పడకపూర్వం తెలంగాణా తాలూకా కేంద్రాలలో పాఠశాలలులేవనీ, ఇప్పుడు ప్రతిగ్రామంలో పాఠశాల వున్నదనీ అన్నారు.

విద్యార్థులు తమ భవిష్యత్తును ఆలోచించుకొని పాఠశాలలకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.


తుఫాను బెడద

తెలంగాణా ఆందోళన ఒకవైపు సాగుతుంటే ఆంధ్ర కోస్తా జిల్లాలలో మే నెల 15 న పెద్ద తుఫాను దెబ్బ తగిలింది.



గ్రామాలమీద వరద నీటి దురాక్రమణ

గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి, ఖమ్మం జిల్లాలకు అపార నష్టం వాటిల్లింది. ప్రాణ నష్టం, పశు నష్టం జరిగింది. వెయ్యి మంది వరకు మరణించి వుంటారని అధికారులు అంచనా వేశారు. పశు నష్టం ఎంత జరిగిందీ లెక్కలేదు. అనేక గ్రామాలు జలమయమైనవి. వేలాది కుటుంబాలు నిరాశ్రయులైనారు. పంట పొలాలు వరద తాకిడికి ధ్వంసమైనాయి. పొలాల్లో కోసి పడేసిన పంట యావత్తు ధ్వంసమైపోయింది. రైళ్ళ రాకపోకలు బస్సుల రాకపోకలు ఆగిపోయాయి. మద్రాసు – విజయవాడ




చెట్లక్రింద నివాసం



రైలు మార్గానికి మరమ్మతులు

మధ్య రైళ్ళు నడవలేదు వాడి, గుంతకల్లు మీదుగా వాటిని మళ్ళించవలసి వచ్చింది.

పశ్చిమ గోదావరి జిల్లాలో 70 వేల ఎకరాల పంట నష్ట పడింది. ఇటువంటి ప్రకృతి వైపరీత్య నష్టాలను తట్టుకోవాలంటే, రాష్ట్రంలో పంటల భీమా పథకాన్ని అమలు చేయాలని వ్యవసాయ మంత్రి శ్రీ తిమ్మారెడ్డి సూచించారు. కొల్లేటి ప్రాంతంలో నష్టం 40 కోట్లవరకు వుంటుందని దేవదాయశాఖ మంత్రి శ్రీ రుద్రరాజు రామలింగరాజు అంచనా వేశారు. దాళ్వా పంట నష్టం రు 25_30 కోట్ల మేరకు వుండగలదని అంచనా వేస్తున్నారు. వరద బాధితుల సహాయార్థం అనేక సంస్థలు విరాళాలు సేకరిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖ కోటి రూపాయలు మంజూరు చేసింది.



చచ్చిపడిన జీవాలు

గుంటూరు జిల్లాలో 800 చౌక డిపోలు తెరిచారు,

తుఫాను బాధితులకు పునరావాసం కల్పించడానికి వెంటనే 5 కోట రూపాయలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కలెక్టర్లతో జరిపిన సమావేశంలో నిర్ణయించారు.

వరదలకు గురైనవారి సహాయార్థం, చెడిపోయిన ఇరిగేషన్ పనులు, రోడ్ల మరమ్మతుకు ఈ ధనాన్ని విని యోగిస్తారు.

వరదలవల్ల పాడైపోయిన ధాన్యాన్ని భారత ఆహారసంస్థవారు కొనుగోలు చేస్తారనీ, వరదలకు గురైన కోస్తా జిల్లాలలో 50 కొనుగోలు కేంద్రాలను ఈ సంస్థ ఏర్పాటు చేస్తుందనీ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. టి. రాజు తెలిపారు. అవసరమైనప్పుడల్లా అదనపు కొనుగోలు కేంద్రాలు తెరుస్తారు ధరలను నిలకడగా వుంచి రైతులకు సహాయ పడటానికి ఈ చర్య తీసికొంటున్నారు

వరదలకు గురైన గ్రామాలకు భూమి శిస్తు మినహాయింపు ఇస్తారు. 90శాతంభూమిశిస్తు మినహాయిస్తున్నట్లు అధికారులు అంచన

చేశారు. భూమి శిస్తు బకాయిల వసూళ్ళ, రుణాల వసూళ్ళ, డ్రైనేజిసెస్సు మొదలైన వాటి వసూళ్ళ యీ సంవత్సరానికి నిలిపి వేశారు.

నక్సలైట్లు


తెలంగాణా ఆందోళన ఒక వైపున సాగుతుంటే ఖమ్మం జిల్లాలోను, వరంగల్లు జిల్లాలోను శ్రీకాకుళం జిల్లాలోను నక్సలైట్ల దాడులు జరుగుతున్నాయి. ఖమ్మంజిల్లా పేరూరు పోలీసు ఆఫీస్‌పై 20 మంది నక్సలైట్లు మే 12 రాత్రి దాడిచేశారు. దీని ఫలితంగా ఇద్దరు మరణించారు. నలుగురు గాయపడ్డారు. శ్రీకాకుళం జిల్లా,సోంపేట గ్రామంలో ఒకఇంటిపై నక్సలైట్లు దాడిచేసి బంగారు నగలు, రెండు బస్తాల బియ్యం 500 రూపాయల నగదు దోచుకున్నారు.

ఒకవైపు తెలంగాణాలో ఆందోళన, మరో వైపు తుఫాను బీభత్సం ప్రభుత్వాన్ని కలవర పరుస్తున్న సమయంలోనే, నక్సలైట్ల బెడద కూడా జరిగింది. ప్రజాస్వామ్యాన్ని, శాంతి భద్రతలను ఆకాంక్షించేవారు ప్రభుత్వంతో సహకరిస్తూ, అభ్యుదయ పథానపురోగమించే కృషి కొనసాగించ వలసి వున్నది.

ఈ పరిస్థితులలో బాధ్యతతో వ్యవహరించవలసిన ప్రభుత్వోద్యోగులు ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి చిక్కులు కల్పించపూనుకొనడం విచారకరం. తెలంగాణా ఎన్.జి. ఓ. ల సంఘం అధ్యక్షుడు ఎన్. జి. ఓ. లలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్రేకాలు రేకెత్తించే ప్రసంగాలు చేయడం జరుగుతున్నది. దీనిపై ఆయనను బర్తరఫ్‌చేస్తూ రాష్ట్రగవర్నరు శ్రీ ఖండుభాయ్ దేశాయ్ ఉత్తరువు జారీ చేసి, తెలంగాణా ఎన్. జి. ఓ. ల సంఘానికి, తెలంగాణా ఉపాధ్యాయ సంఘానికి ప్రభుత్వ పరిగణను రద్దు చేశారు.

హరిజనులకు సహాయం

మే 11వ తేదీన ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి హరిజన విద్యార్థుల సదస్సుకు హైదాబాదులో ప్రారంభోత్సవం చేశారు. కళాశాలలో చదువుకొనే హరిజనుల విద్యార్థులకు భోజన వసతి కోసం చేసే ఆర్థిక సహాయాన్ని నెలకు పది రూపాయల చొప్పున వచ్చే విద్యాసంవత్సరంనుండి పెంచడానికి ప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇప్పుడు కళాశాల విద్యార్థులకు నెలకు ఒక్కొక్కరికి 30 రూపాయలుఅందుతున్నాయి. ఈ మొత్తాన్ని 40 రూపాయలకు పెంచడం జరుగుతుంది. హైస్కూలు చదువులోవున్న హరిజన విద్యారులకుకూడా వీలైనంత వరకు ఈ సహాయం పెంచగలమన్నారు.



హరిజన విద్యార్థుల సదస్సు ప్రారంభోత్సవం

పులివెందుల ప్రాజెక్టు

కడప జిల్లాలో పులివెందుల కాలువ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించాలని రాష్ట ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కాలువ నిర్మాణం పూర్తయితే తీవ్ర దుర్భిక్ష ప్రాంతాలలో సుమారు అరవై వేల ఎకరాలకు నీటి సదుపాయం లభిస్తుంది. ఈ పథకంవల్ల మొత్తం 45 వేల ఎకరాలలో మెట్టసాగుకు, 15 వేల ఎకరాలలో మాగాణి సాగుకు ప్రయోజనం కలుగుతుంది.

రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి శ్రీ సిద్దారెడ్డి మే నెల 13న హైదాబాదులో ఈ విషయం వెల్లడిచేస్తూ, ముందుగా అభివృద్ధి పన్ను విధించడానికి సంబంధించిన చట్టం క్రింద ప్రారంభించబడే పథకాలలో ఇది ఒకటన్నారు.

నగరంలో...

తెలంగాణా ఆందోళన

జంట నగరాలలో కొంతకాలంగా గోడలపై అసభ్య వ్రాతలను చూస్తున్నాము. సంస్కారం కలిగిన ఎవరైనా తలవంచుకొనవలసిన వ్రాతలవి. ఇటువంటి వ్రాతలను గురించి ఇతర రాష్ట్రాల వారూ, విదేశీయులూ, ఏమనుకొంటారు.? గోడమీది అసభ్య వ్రాతల ఫొటోలను ఎవరైనా తీసి ఉండవచ్చు గదా!

గోడలు మనదేశంలో ఒకప్పుడు భారతీయ సంస్కృతినీ, ఔన్నత్యాన్నీ ప్రతిబింబించే మహత్తర చిత్రకళకు ఉపయోగపడినవి. అలనాటి కుడ్యచిత్రాలు దేశదేశాల కళారాధకుల ప్రశంసలనందుకొన్నాయి ఈ నాటి గోడలమీది వ్రాతలో!

అసభ్య వ్రాతలు వ్రాసేవారు ఏ కొద్దిమందో కావచ్చుగాక. కాని అందువల్ల వచ్చే అప్రతిష్ట ఎవరిది? చదువు సంధ్యలు లేని అజ్ఞానులెవరో వాటిని వ్రాసారని సరిపెట్టుకొనవచ్చు. మరివాటిని సమర్థించేవారి మాటేమిటి?

తెలంగాణా పత్రికా రంగానికిభిక్షపెట్టిన స్వర్గీయ సురవరం ప్రతాపరెడ్డిగారి "ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి" గ్రంథాన్ని ఒకసారి చదివి, గోడలమీది వ్రాతలను అవలోకిస్తే బాధ సుబోధకమవుతుంది.

మందుల ప్రకటనలు, అసభ్య వ్రాతలు, నినాదాలు ప్రతినినాదాలతో గోడలు నిండిపోతున్నవి.

ప్రజాస్వామ్యంలో ఆందోళనలూ, ఉద్యమాలూ తప్పుకాదు. అవి పెర్రితలలు వేస్తేనే ముప్పు. బస్సులు తగలబెట్టడం రైళ్ళను కాలబెట్టడం తమదారిన తాముపోయే అమాయకుల కార్లపై రాళ్ళు వేసి నష్టం కలిగించడం కొంతకాలంగా జరుగుతున్నది. అందువల్ల కలిగే అనర్థాలను, చేసినవారికి అక్కర లేకపోయినా ప్రజలు తెలుసుకోవలసిన అవసరంఉంది. ప్రజలు తెలుసుకొనినప్పుడే నివారణ సాధ్యమవుతుంది.

చదువులు

విద్యార్థుల చదువు చెడిపోవడం, విలువైన కాలం వృధా కావడం కలకత్తా, బొంబాయి మొదలైన ప్రాంతాలనుండి రాగల వనుకొన్న పరిశ్రమలు వెనక్కుపోవడం అటుంచి అరాచక చర్యలూ, దౌర్జన్య ధోరణులవల్ల నగర పరిస్థితిని గురించి దేశంలో ఇతర ప్రాంతాలవారికి ఒక రకమైన భీతి కలిగింది.

డిసెంబరునుంచి మే నెలవరకు సాధారణంగా టూరిస్టు సీజను. నగర హోటళ్ళ సమ్మర్దం ఎక్కువగా, ఉండేకాలమది. ఐతే కొన్నాళ్లుగా, ముఖ్యంగా గడచిన ఒకటి రెండు నెలలుగా నగరానికి ఇతర ప్రాంతాలనుంచి జనం రావడం బాగా తగ్గింది.

వృత్తి, వ్యాపారాలు

గదులలో సగానికి పైన ఖాళీగా పడుంటున్నవని, యేటా 80 వేల రూపాయల టెలిఫోన్ బిల్లు చెల్లించే ఒక హోటలు యజమాని చెప్పారు. ప్రతి నెలా పదిహేను నుంచి ఇరవై వరకు విందులు జరుగుతుండేవి. ఏప్రిల్, మే నెలలో పెళ్ళిళ్ళ సీజను కూడా. ఐనప్పటికీ గడచిన రెండు మాసాలలోనూ ఒకటో రెండో విందులు మాత్రమే మా హోటల్లో జరిగాయి. నగరానికి వచ్చే కంపెనీల ఉద్యోగులు, సినిమాలవారు, మందుల కంపెనీల ప్రతినిధులూ, విలాస యాత్రికులు కూడా తగ్గారు, వ్యాపారం తగ్గినప్పుడు ఇంతమంది సిబ్బందిని ఎలా పోషించాలని మధనపడుతున్నాము, అని ఆయన అన్నారు.

విశ్వ విద్యాలయ సంబంధమైనవీ, కంపెనీల సంబంధమైనవీ వేసవిలో సగటున రెండురోజుల కొకటైనా నగరంలో సమావేశాలు జరుగుతుండేవి. సాధారణంగా వాటిలో చాలాభాగం హోటళ్ళలో ఏర్పాటవుతుండేవి. వేసవి పూర్తికావస్తున్నా ఈ సారి ఒకటి రెండు సమావేశాలైనా జరిగిన జాడ లేదని మరో హోటల్ నిర్వహణాధికారి చెప్పారు.

ఇతర వ్యాపారాలుకూడా ఇలాగే నష్టపడ్డాయి. సినిమాలకు, ముఖ్యంగా రెండవ ఆటకు వెళ్ళే జనం పలచబడ్డారు. చిత్ర నిర్మాణ పరిశ్రమపై సైతం దీని ప్రభావం తప్పలేదు.

గృహ నిర్మాణాలు మందగించాయి. స్థిరాస్తులు కొనడం, అమ్మడం ఇంచుమించు స్తంభించింది.

అసలే నష్టం మీద నడుస్తున్న సిటీ బస్సు సర్వీసులకు రోజూ అనేక వేల రూపాయల నష్టం వస్తున్నది.

పరీక్షలూ, "సమ్మర్ ఇన్‌స్టిట్యూట్"లతో హడావుడిగా ఉండవలసిన ఉస్మానియా విశ్వ విద్యాలయ ప్రాంతం గత రెండు నెలలుగా చైతన్య రహితంగా ఉన్నది. విద్యార్థులలో ఇప్పుడిప్పుడే చదువు నష్టంగురించి గుర్తింపు కలుగుతున్నట్టు కనిపిస్తున్నది. ఆట విడుపునకు కూడా హద్దు ఉన్నదన్ని గుర్తించిన విద్యార్థులు పరీక్షలకు తొందరపెడుతున్నారు. మే 28వ తేదీన పరీక్షలు పెట్టమని కోరుతూ జరిగిన విద్యార్థుల ఊరేగింపు దీనికి నిదర్శనం.

- ఒక విలేఖరి.

విద్యార్థీ!

గంధం జోయెల్

విద్యార్థీ !
విధి లేక వ్రాస్తున్నాను
విలపిసూ గీస్తున్నాను
వికావికలైన నీ చిత్తరువును

దేశం మీద మమకారం
లేశమైనలేని నాడు
జాతీయత సుస్తీ చేసి
జ్వరంతో మూల్గుతున్న నేడు

నలుగురిలో మన మంతా
నవ్వుల పాలైన కాలంలో
నావికునికి చుక్కాని లేనపుడు
జీవితానికి గమ్యం దొరకనపుడు

బ్రతుకును స్వార్థపరులకోసం
బలి చేయవలదు తమ్ముడూ !

మంచి పీడి చెడులోనికి
పరివర్తనం చెందకు
మోజుపడి, 'అద్దాల భవంతి'
రాజకీయంలో ప్రవేశించకు

ఆలోచన పరీమళాలు
పూలుపూయాల్సిన కాలంలో
తోటలో గులాబీల యవ్వనం
తొణికిస లాడవలసిన తరుణంలో

మదగజాలు పూలవనాల్ని
త్రొక్కి నాశనం చేస్తున్నాయి
రాజకీయ పులులు ప్రతిచోటా
విచ్చల విడిగా విహరిస్తున్నాయి

జీవితంలో సువర్ణ తరుణం
విద్యార్థి విజ్ఞాన జీవితం
కలకాలం ఈ పావన దశకు
కళంకం మాత్రం రానీయకు

అడుగులు తడబడుతూ వుంటే
ఆలోచించి ముందుకు నడు
ఆశయాల ఆశ్రయమ్ము జూపి
అంటిస్తారు కొంపకు నిప్పు
నీకళ్లలో కారం కొట్టి
నిన్నంధుని చేసేవారు

కొండంత ఆశ జూపించి
ఎండ మావులకు నడిపేవాళ్లూ
నువ్వు ఏడుస్తూ వుంటే
నవ్వుతూ జోకొడతారు

ద్వేషాగ్నిని యితరులకై
దివిటీగా వెలుగించకు
తన వారిని పరులుగ
తలచి పలువరించకు

ప్రేమము పెంచుకున్న
మనసేగద మందిరమ్ము
మన మందర మైక్యతతో
మసలిన నది స్వర్గమ్ము

విద్యార్థీ!
విధిలేక వ్రాస్తున్నాను.

జిల్లాలనుంచి

కరీంనగర్ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు

కరీంనగర్ జిల్లా అభివృద్ధి మండలి 16వ సమావేశం ఇటీవల కలెక్టరు శ్రీ ఎల్. మాలకొండయ్య అధ్యక్షతన జరిగింది. ఆ సందర్భంలో జిల్లా కరువు సహాయ కార్యక్రమాన్ని సమీక్షించారు. కరువు సహాయ కార్యక్రమం క్రింద కరీంనగర్ జిల్లా హద్దులలో పోచంపాడు ప్రాజెక్టు కాలువల పనులకు రూ. 11.05 లక్షలు ఖర్చు పెట్టారు. 115 పబ్లిక్‌వర్క్సుశాఖ సేద్యపు నీటిపారుదల పనులకు రూ. 5.5 లక్షలు ఖర్చు చేశారు. ఇటీవల క్రొత్తగా కేటాయించిన డబ్బుతో మరో 73 పనులను చేపట్టుతున్నారు. వీటికి రూ. 16 లక్షలు ఖర్చవుతుంది.


రూ. 12.41 లక్షల ఖర్చుతో 513 చిన్న రకం సేద్యపు నీటి పారుదల పనులు చేపట్ట బడినవి. ఇటీవల చేసిన కేటాయింపులలో రూ. 4.10 లక్షలు వ్యయమయ్యే మరో 118 పనులను యిప్పుడు చేపట్టుతున్నారు.

1,853 బావుల త్రవ్వకం లేక పునరుద్ధరణ కార్యక్రమాన్ని అమలు జరుపుతున్నారు. వీటిలో 428 బావులు క్రొత్తవి. మిగిలిన బావులను పూడికతీసి లోతు చేస్తారు. ఈ మంచినీటి బావుల పనులకు రూ. 11,60,000లు ఖర్చవుతుంది.


రూ. 3.28 లక్షల ఖర్చుతో 46 జిల్లా పరిషత్తు రోడ్డు పనులను చేపట్టారు. క్రొత్తగా కేటాయించిన మొత్తంలో నుంచి రూ. 4.65 లక్షల వ్యయంతో 34 పనులను నిర్వహించదలచారు.

తక్కావీ పథకం ప్రారంభించబడినప్పటినుంచి యిప్పటి వరకు ఈ పథకం క్రింద రూ. 10.70 లక్షల మొత్తాన్ని పంపిణీ చేశారు.


ఖమ్మంజిల్లాలో తుఫాను



మధిరలో ముఖ్యమంత్రి



పూర్తిగా కొట్టుకుపోయిన జుచ్చిరెడ్డి పాలెం



సోమవరం దగ్గిర రోడ్డుకు గండ్లు

PUBLISHED BY THE DIRECTOR, JANA SAMBANDHA SHAKHA, A.P. HYDERABAD, AND PRINTED BY THE DIRECTOR OF PRINTING, AT THE GOVERNMENT CENTRAL PRESS, HYDERABAD.



